
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కడప
జిల్లా వార్తలు

5

బుధవారం 10 సెప్టెంబరు 2025



శునకం... భయానకం!

జిల్లా వ్యాప్తంగా వీధికుక్కల బెడద తీవ్రమవుతోంది. ఒంటరిగా వీధుల్లోకి వెళ్లాలంటేనే ప్రజలు జంకుతున్నారు. కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ చిన్నా పెద్దా తేడా లేకుండా దాడులకు తెగబడుతున్నాయి. వాహనాల వెంట పడుతుండడంతో రోడ్డు ప్రమాదాలు సైతం జరుగుతున్నాయి. ద్విచక్ర వాహనదారులపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. రోజురోజుకు బాధితులు పెరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

- కుక్కలున్నాయ్.. పిక్కలు జాగ్రత్త.. ● వీధుల్లో స్వైరవిహారం
- కొత్తవారు రావాలన్నా జంకుతున్న వైనం
- నియంత్రణలో అధికారులు విఫలం

కడప ఎర్రముక్కపల్లె, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కాలంలో కడప జిల్లాలో వీధి కుక్కల సంఖ్య బాగా పెరిగింది. కుక్కల నియంత్రణపై అధికారులకు ఆదేశాలు లేకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రస్తుతం కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో అధికారులు అంతగా దృష్టి కేంద్రీకరించడం లేదనేది అందరికీ తెలిసిందే. కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాల్సిన స్థానిక సంస్థల అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారని ధ్వజమెత్తుతున్నారు. జిల్లాలో రోజూ ఎక్కడో చోట కుక్కలదాడిలో ఒకరిద్దరు గాయపడుతూనే ఉన్నారు. ఇటీవల కుక్కలదాడి ఘటనలను పరిశీలిస్తే భయానకంగా ఉంటున్నాయి. కాళ్లు, చేతులు, మొహం రక్తమోడే విధంగా గాయాలు చేస్తున్నాయి. జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో కుక్కకాటు ఘటనలు ఎక్కువగా నమోదవుతున్నాయి.

4 వేల కుక్కలకు శస్త్రచికిత్సలు

జిల్లా కేంద్రంలో కుక్కల సంఖ్యను నియంత్రించేందుకు నియంత్రణ కేంద్రం ఏర్పాటు చేసినా ఫలితం లేకుండా పోయింది. మిగతా మున్సిపాలిటీల్లోనూ ఇదే పరిస్థితి. కుక్కల నియంత్రణకు మున్సిపాలిటీలు, పంచాయతీల్లో చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఉన్నా అమలుకు నోచుకోవడం లేదు. నియంత్రణ చర్యల పేరిట నిధులు పక్కదారి పడుతున్నాయే



తప్ప కుక్కల సంఖ్యను నియంత్రించలేకపోతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉంటే కుక్కల సంఖ్య నియంత్రణకు జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కేంద్రంలో గత ఏడాది 4 వేల శస్త్రచికిత్సలు చేశారు. అయితే కొన్ని అనివార్య కారణాలతో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్‌ను ప్రభుత్వానికి సరెండర్ చేశా రు. దీంతో ప్రస్తుతం శస్త్రచికిత్సల ఊసే లేదు.

తస్మాత్ జాగ్రత్త

కుక్కల సంతతి ఉత్పత్తి అధికంగా జరిగే జూలై నుంచి డిసెంబరు వరకు జాగ్రత్తగా ఉండాలని పశువైద్య నిపుణులు సూచిస్తున్నారు. గర్భందాల్చిన కుక్కలు ఎక్కువ కోపంతో ఉంటాయని, ఇలాంటి కుక్కలు తమను తరిమే ప్రయత్నం చేసే వారిపై దాడి చేస్తూ గాయపరుస్తుంటాయని తెలిపారు. కుక్కల కళ్లలోకి నేరుగా చూడకూడదని, అలాచేస్తే అవి రెచ్చగొట్టినట్లుగా భావిస్తాయన్నారు. పెంపుడు కుక్కలు కూడా కొన్ని సందర్భాల్లో ఇలాగే ప్రవర్తిస్తాయని తెలిపారు. తినే సమయంలో కుక్కలను కదలించకూడదని, నోటి నుంచి లాలాజలం వస్తుంటే అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలు కుక్కలపై రాళ్లు వేయొద్దని, కర్రలతో కొట్టే ప్రయత్నం చేస్తే భయాందోళనలకు గురై కుక్కలు ఎదురుదాడి చేసి గాయపరుస్తాయని చెబుతున్నారు. కుక్క కరిచిన వెంటనే గాయమైన చోట నీటి ధారలో సబ్బుతో శుభ్రపరచుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

ఈ విషయంపై కడప కార్పొరేషన్ కమిషనర్ మనోజ్‌రెడ్డిని వివరణ అడిగేందుకు ఫోన్ చేయగా ఆయన స్పందించలేదు.





కడప నగరం గంజికుంటకాలనీ, గెలాక్సీ అపార్ట్‌మెంట్ వీధి, సన్‌సిటీ, ఏఎస్ఆర్‌నగర్‌లో స్వైరవిహారం చేస్తున్న వీధికుక్కలు

250 దోసులకు పైగా అందుబాటులో



సర్వజన ఆసుపత్రిలో కుక్కకాటుకు వ్యాక్సిన్ అందుబాటులో ఉన్నాయి. దాదాపు 250 డోసులకు పైగా రేబిస్ వ్యాక్సిన్‌ను ప్రజల సౌకర్యార్థం ఎటువంటి ఇబ్బందులు పడకుండా ముందు జాగ్రత్తగా నిల్వ ఉంచాము.

- డాక్టర్ వెంకటేశ్వర్లు, రిమ్స్ సూపరింటెండెంట్

అందుబాటులో రేబిస్ వ్యాక్సిన్

ప్రభుత్వాసుపత్రుల్లో కుక్క కాటు నివారణ వ్యాక్సిన్ అందుబాటులో ఉంది. ప్రస్తుతం అర్బన్ హెల్త్ సెంటర్లు, ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, జిల్లా ఆసుపత్రుల్లో వ్యాక్సిన్‌లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

- డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు

నేటి నుంచి పలు రైళ్లకు స్టాపింగ్

కొండాపురం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో పలు రైళ్లకు బుధవారం నుంచి స్టాపింగ్ పునరుద్ధరిస్తున్నట్లు రైల్వేశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కరోనాకు ముందు స్టాపింగ్ ఉన్న కొన్ని రైళ్లు యథావిధిగా నడవనున్నట్లు తెలిపింది. ఈ నెల 10 నుంచి పూణే- కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్ (ట్రైన్ నెంబర్ 16381/16382) రైలు కొండాపురం, నందలూరులలో ఆగనుంది. తిరుపతి-కొల్హాపూర్ ట్రైన్ నెంబర్ (17415/17416) రాజంపేట, ఓబులవారిపల్లెలో, కాచిగూడ-చెంగల్‌పట్టు (ట్రైన్‌నెంబర్ 17652) కోడూరులో ఆగనుంది. అహ్మదాబాద్-చెన్నై (ట్రైన్ నెంబర్ 20953/ 20954) రైలు, అదేవిధంగా చెన్నై-ఛత్రపతి శివాజీ టెర్మినల్ (ట్రైన్ నెంబర్ 22157, 22158 22159), లోకమాన్యతిలక్- చెన్నై (ట్రైన్ నెంబర్ 12163), ముంబై-నాగర్‌కోయిల్ (ట్రైన్ నెంబర్ 16351/16352) ఈ రైళ్లన్నింటికీ రాజంపేట, కోడూరు స్టేషన్లలో స్టాపింగ్ ఇచ్చారు. ఈ నెల 13 నుంచి తిరుపతి-ఔరంగాబాద్ ఎక్స్‌ప్రెస్ (ట్రైన్ నెంబర్ 17622) రైలుకు ఎర్రగుంట్ల స్టేషన్‌లో స్టాపింగ్ ఇస్తున్నట్లు రైల్వేశాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

రైతుల గోడు కూటమికి పట్టదా ?

- ర్యాలీలో మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



ర్యాలీలో మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, వైసీపీ నేతలు

కడప కలెక్టరేట్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో యూరియా కొరతతో రైతులు పంటల సాగు చేసుకోలేక ఇబ్బందులు పడుతుంటే కూటమి సర్కారు మొద్దునిద్రలో నటించడం సిగ్గుచేటని మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా విమర్శించారు. మంగళవారం రైతులకు అండగా వైసీపీ ఆధ్వర్యంలో అన్నదాత పోరు నిరసన ర్యాలీ వైసీపీ జిల్లా కార్యాలయం నుంచి కడప ఆర్డీఓ కార్యాలయం వరకు నిర్వహించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో ఏఓ శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ డిప్యూటీ సీఎం మాట్లాడుతూ రైతులు క్యూలైన్లో గంటల తరబడి ఉంటే దాన్ని బఫే భోజనమంటూ వ్యవసాయశాఖ మంత్రి వాఖ్యలు చేయడం సరైంది కాదని, వెంటనే ఆయన రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి నాయకులు, కోఆప్షన్ మెంబర్లు, సభ్యులు, జిల్లా, నగర అనుబంద నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

పులివెందుల చీనీకాయల మార్కెట్‌లో ఈ-నామ్ అమలు

పులివెందుల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పులివెందుల మార్కెట్ యార్డు ఆవరణంలోని చీనీకాయల క్రమ విక్రయాల్లో ఈ-నామ్ విధానం అమలు ప్రారంభమైందని వ్యవసాయ మార్కెట్‌కమిటీ కార్యదర్శి వి.శ్రీధర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదేశాలతో ప్రాంతీయ సంయుక్త మార్కెటింగ్ సంచాలకులు రామాంజనేయులు, జిల్లా వ్యవసాయ వాణిజ్య మార్కెటింగ్ అధికారి అజాద్‌వలి సూచనలతో పులివెందుల చీనీకాయల మార్కెట్‌లో ఈ-నామ్ అమలు ప్రారంభమైనట్లు తెలిపారు. ఈ విధానంతో చీనీకాయల క్రయ, విక్రయాల్లో పారదర్శకతతో పాటు రైతులు పండించిన చీనీ కాయలకు మంచి ధర లభిస్తుందని తెలిపారు.

అన్ని సౌకర్యాలతో హాస్టళ్లు

- మంత్రి డోల బాలవీరాంజనేయులు
- పోట్లదుర్తిలో ఆకస్మికంగా హాస్టల్ తనిఖీ



విద్యార్థులతో మమేకమైన మంత్రి డోల

ఎర్రగుంట్ల, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం హాస్టళ్లలో అన్ని సౌకర్యాలు కల్పిస్తోందని, బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు వెళ్లాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల బాలవీరాంజనేయులు పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం మంత్రి కడప జిల్లా పోట్లదుర్తిలోని హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. మెనూపై విచారించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల రూ.44 లక్షలతో హాస్టల్‌లో మరమ్మతులు చేసినందుకు సీఎం చంద్రబాబు, మంత్రి డోలకు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. వర్షాకాలంలో విద్యార్థులకు ఇబ్బందుల్లేకుండా వరండా వేయాలని అధికారులకు సూచించారు. సీఎం, సంబంధిత మంత్రి, కలెక్టర్ పేర్లతో కూడిన బోర్డులను హాస్టల్‌లో ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులు చదువుపై శ్రద్ధ పెట్టాలని, ఉన్నత శిఖరాలకు వెళ్లాలంటే కష్టపడి చదవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యు స్వర్ణలత, వార్డెన్ నరసారెడ్డి, ట్యూటర్ మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మేయర్‌కు మరోసారి నోటీసు

- ఇదేచివరి అవకాశమంటూ సూచనలు

కడప ఎర్రముక్కపల్లె, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కడప కార్పొరేషన్ మేయర్ సురేష్‌బాబుకు ఈ నెల 17న హాజరుకావాలంటూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్‌కుమార్ సోమవారం మరోసారి నోటీసును జారీ చేశారు. ఇదేచివరి అవకాశం అంటూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సురేష్‌బాబు, జీహెచ్ఎంసీ చట్టం 1955లోని సెక్షన్ 22(1)(హెచ్) ఉల్లంఘించి తన భార్య, కుమారుడి సొంత సంస్థ ఎం/ఎస్ వర్ధిని కన్‌స్ట్రక్షన్స్‌కు మున్సిపల్ కార్పొరేషన్ కాంట్రాక్టులు మంజూరయ్యేలా చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ నివేదిక ఆధారంగా ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. హైకోర్టు ఆదేశాల మేరకు సురేష్‌బాబుకు గతంలో విచారణలో న్యాయమైన అవకాశం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆయనను విచారణకు రావాలంటూ ఇప్పటికే రెండుసార్లు నోటీసులు ఇచ్చారు. ఈ నేపథ్యంలోనే ఈ నెల 17న తన కార్యాలయంలో పరిశీలనకు అందుబాటులో ఉంచాలని, అదేరోజు మధ్యాహ్నం 3గంటలకు వ్యక్తిగత విచారణకు హాజరుకావాలని మేయర్‌కు ఆదేశాలు జారీ చేశారు. లేనిపక్షంలో చట్టం ప్రకారం తగిన నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు.

కూలీల ఆటో బోల్తా...ఇద్దరు మృతి

- నలుగురికి గాయాలు

7

సిండికేట్ లేకుండా వ్యాపారం చేయండి

- పులివెందుల టీడీపీ ఇన్‌చార్జ్ బీటెక్ రవి



మార్కెట్ యార్డులో సమస్యలు వింటున్న బీటెక్ రవి

పులివెందుల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పులివెందుల మార్కెట్ యార్డులో సాగుతున్న చీనీ వ్యాపారంలో సిండికేట్ లేకుండా వ్యాపారం సాగించాలని మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్రనాథ రెడ్డి (బీటెక్ రవి) పేర్కొన్నారు. చీనీ వ్యాపారంలో సిండికేట్‌తో నష్టపోతున్నామని రైతుల నుంచి వచ్చిన నిరసనతో గత రెండు రోజులుగా బీటెక్ రవి దృష్టి సారించారు. సోమవారం రైతులతో మాట్లాడిన ఆయన మంగళవారం రైతులు, వ్యాపారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యా రు. ఈ సందర్భంగా పలువురు రైతులు 32 మంది లైసెన్స్‌దారులు ఉన్నా కేవలం ముగ్గురు నలుగురు వ్యాపారులు మాత్రమే వ్యాపారం సాగిస్తున్నారని బీటెక్ రవికి వివరించారు. గత ఏడాదిగా 32 మంది లైసెన్స్ ఉన్నవ్యాపారుల లావాదేవీలు పరిశీలిస్తే ఇక్కడ సిండికేట్ జరుగుతుందా లేదా అనేది అర్థమవుతుందన్నారు. బీటెక్ రవి స్పందిస్తూ వ్యాపారం సాగించని వారు ఉంటే వారి లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. 32 మంది వ్యాపారులు ఉన్నా కేవలం ముగ్గురు, నలుగురు మాత్రమే వ్యాపారం చేస్తే సిండికేట్‌గా భావించాల్సి వస్తుందన్నారు. దీనిలో మొదటి, రెండు, మూడవ రకాలుగా డివైడ్ చేసి వీటికి ధరలు కేటాయిస్తారని, మొదటి రకంలో వచ్చిన చీనీకాయలను రైతులందరికీ ఒకేధర ఉంటుందన్నారు. మార్కెట్ యార్డు రైతుల కోసం మాత్రమేనని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శశిభూషణ్ రెడ్డి, మార్కెట్ యార్డు మాజీచైర్మన్ పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో యూరియా కొరత లేదు

- రబీ సీజన్‌కు సరిపడా యూరియా
- పాత్రికేయుల సమావేశంలో కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, ఎస్పీ అశోక్‌కుమార్, జేసీ అదితీ సింగ్

కడపకలెక్టరేట్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు సరిపడా యూరియా నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి స్పష్టం చేశారు. మంగళవారం కలెక్టరేట్ వీసీ హాలులో జిల్లాలో యూరియా నిల్వలు, పంపిణీపై కలెక్టర్, జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, ఎస్పీ అశోక్‌కుమార్‌తో కలిసి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ అవసరాల నిమిత్తం ప్రభుత్వం సరఫరా చేస్తున్న యూరియాను అక్రమంగా విక్రయించడం లేదా ఇతర అవసరాలకు మళ్లించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో లక్ష ఎకరాల్లో వరి సాగుబడి ప్రణాళికను జిల్లా వ్యవసాయ అధికారులు సిద్ధం చేశారని, ప్రధానంగా కేసీ ఆయకట్టు పరిధిలో 45 ఎకరాల విస్తీర్ణంలో వరి పంటసాగులో ఉందన్నారు. మరో నెల రోజుల్లో సాగు విస్తృతి 80 వేల ఎకరాలకు పెరగనుందని తెలిపారు. ఈ ఏడాది మూడు వారాల ముందే సరిపడా వర్షపాతం నమోదు కావడంతో కేసీ, బ్రహ్మంసాగర్ ఆయకట్టులో రైతులు ఉత్సాహంగా వరి పంటను సాగు చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఇప్పటికే 12,800 మెట్రిక్ టన్నుల యూరియాను ఆయా ప్రాంతాల రైతు సేవా కేంద్రాలకు, సంబంధిత డీలర్ల ద్వారా అందించామని తెలిపారు. మరో వారంలో 50 వేల మెట్రిక్ టన్నులు అందుబాటులోకి రానుందన్నారు. గత మూడు రోజులుగా 1300 మెట్రిక్ టన్నుల ఎరువులను అందించామని, యూరియాను సమతుల్య స్థాయిలోనే వాడాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో మరో వారం తరువాత ఉల్లి పంటలు సాగులోకి రానున్నాయని, ప్రస్తుతం చీనీ పంట చివరి దశలో ఉందని తెలిపారు. పంట మార్కెటింగ్ విషయంలో దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. ఎస్పీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో యూరియా సరఫరాకు సంబంధించి పోలీసుశాఖ ప్రత్యేక సహాయ సహకారాలు అందిస్తోందన్నారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎరువులు, విత్తనాల పంపిణీ కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. యూరియా కొరత ఉందని తప్పుడు సమాచారం ఇస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రానాయక్, ఏపీ మార్క్‌ఫెడ్ డీఎం పరిమళ జ్యోతి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్లతోనే విద్యాబోధన

- 17 ఏళ్లుగా సొంత భవనం లేని ఉర్దూ జూనియర్ కళాశాల
- అరకొర వసతులతో సర్దుకుపోతున్న విద్యార్థులు



ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాల




వరండాలోనే నిర్వహిస్తున్న తరగతులు

ప్రొద్దుటూరుటౌన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణంలో పెద్ద సంఖ్యలో ముస్లిం మైనార్టీలు ఉండడంతో ఉర్దూ మీడియంలో ఉన్నత విద్యను అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆ కోవలోనే 2008లో వసంతపేటలోని 18వ వార్డు మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేశారు. ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీ గ్రూపులను ఇంగ్లీషు, ఉర్దూ మీడియంలో ఏర్పాటు చేశారు. ఈ కళాశాలకు పట్టణంతో పాటు జమ్మలమడుగు, ఎర్రగుంట్ల, రాజుపాళెం, చాపాడు, కమలాపురం, ఖాదర్‌పల్లె వంటి దూర ప్రాంతాల విద్యార్థులు వస్తుంటారు. కళాశాలలో 193 మంది విద్యార్థులు ఉండగా బాలికలు 156 మంది, బాలురు 37 మంది ఉన్నారు. గెస్ట్ లెక్చరర్లతో ప్రారంభమైన కళాశాల ఇప్పటికీ అలానే కొనసాగుతోంది. ప్రస్తుతం కళాశాలలో రెగ్యులర్ ప్రిన్సిపల్, అధ్యాపకుడితో పాటు ఒక కాంట్రాక్టు అధ్యాపకుడు, తొమ్మిది మంది గెస్ట్ అధ్యాపకులు పనిచేస్తున్నారు.

● అరకొర వసతులే..

పాఠశాలలో కళాశాల ఏర్పాటు చేసినప్పటి నుంచి తగిన వసతులు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. విద్యపై ఉన్న ఆసక్తితో విద్యార్థులు సర్దుకుపోతున్నారు. జిల్లాలో కడప, ప్రొద్దుటూరు, మైదుకూరు, వేంపల్లిలో ఉర్దూ జూనియర్ కళాశాలలు ఉండగా అత్యధిక మంది విద్యార్థులు ప్రొద్దుటూరు కళాశాలలోనే ఉన్నారు. అలాగే పరీక్షా ఫలితాల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరచి జిల్లా మొదటిస్థానంలో నిలుస్తున్నారు. కళాశాలలో తరగతి గదుల కొరత తీవ్రంగా ఉంది. 12 తరగతి గదులు అవసరం కాగా కేవలం నాలుగు తరగతి గదులు ఉన్నాయి. విద్యార్థులు ఆ నాలుగు గదుల్లోనే సర్దుకుపోతున్నారు. వరండాలోనే ఎండ పడుతున్నా తరగతులు నిర్వహించాల్సి వస్తుంది. సైన్స్ విద్యార్థులకు ల్యాబ్‌లు లేకపోవడంతో వారికి ప్రాక్టికల్స్‌పై అవగాహన కొరవడింది. ఈ కళాశాల వసంతపేట, గాంధీరోడ్డు కూడలిలో ఉండడంతో ఆ రహదారుల్లో నిరంతరం భారీ వాహనాలు వెళుతుండడంతో వాహనాల శబ్దంతో విద్యార్థులు బోధనపై శ్రద్ధ పెట్టలేకపోతున్నారు. అంతేకాక మరుగుదొడ్ల కొరత కూడా ఉండడంతో బాలికల ఇబ్బందులను గుర్తించి ప్రిన్సిపల్ ఏవీ రమణారెడ్డి తన సొంత నిధులతో నాలుగు మరుగుదొడ్లను నిర్మించారు. కాగా దాతలు సహకరించి విద్యార్థుల కోసం కళాశాలలో తరగతి గదులు, ల్యాబ్‌లు ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.


తరగతి గదులు నిర్మించాలి



ప్రస్తుతం కళాశాలలో నాలుగు తరగతి గదులు ఉన్నాయి. మరో నాలుగు క్లాస్‌రూములు నిర్మించాల్సిన అవసరం ఉంది. దాతలు అదనపు తరగతి గదుల నిర్మాణానికి ముందుకొస్తే విద్యార్థులకు మేలు జరుగుతుంది.

- జుబేద్, హెచ్ఈసీ మొదటి సంవత్సరం


మౌలిక వసతులు ఏర్పాటు చేయాలి



కళాశాలలో ల్యాబ్‌లు, క్లాస్‌రూముల కొరత ఉంది. క్లాస్‌రూములు, ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తే విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుంది. విద్యార్థులందరూ నాలుగు రూముల్లోనే సర్దుకుపోవడం వలన ఇబ్బందిగా ఉంటోంది.

- ఆసిఫ్, హెచ్ఈసీ ప్రథమ సంవత్సరం


ల్యాబ్‌లు లేవు



కళాశాల ఏర్పాటు చేసినప్పటి నుంచి ల్యాబ్‌లు లేవు. ప్రాక్టికల్స్ కోసం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లాల్సి ఉంటుంది. అంత దూరం వెళ్లడం బాలికలకు ఇబ్బంది అవుతోంది.

- మహమ్మద్, ఎంపీసీ, ద్వితీయ సంవత్సరం

రెగ్యులర్ అధ్యాపకులను నియమించాలి



కళాశాల ఏర్పాటు అయినప్పటి నుంచి గెస్ట్ లెక్చరర్లతోనే బోధన కొనసాగుతోంది. రెగ్యులర్ అధ్యాపకులను నియమిస్తే నాణ్యమైన బోధన అందుతుంది. మంచి ఫలితాలు సాధించడానికి వీలుంటుంది.

- సఫా, హెచ్ఈసీ మొదటి సంవత్సరం

స్వామిత్వ సర్వేను పూర్తి చేయండి: డీపీవో



గుర్రంకొండలో స్వామిత్వ సర్వేను పరిశీలిస్తున్న డీపీఓ రాధమ్మ

గుర్రంకొండ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్వామిత్వ సర్వేను త్వరగా పూర్తి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి రాధమ్మ సిబ్బందికి సూచించారు. మండలంలోని టి.పసల వాండ్లపల్లె, గుర్రంకొండ గ్రామాల్లో మంగళవారం స్వామిత్వ సర్వేను ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది చేస్తున్న సర్వేను పరిశీలించి వివరాలను సేకరించారు. ఇందులో భాగంగా టి.పసల వాండ్లపల్లె పంచాయతీ పరిధిలో స్వామిత్వ సర్వే తీరు సరిగా లేకపోవడంతో పంచాయతీ సిబ్బందిపై మండిపడ్డారు. పట్టణంలో సర్వేను వేగవంతం చేయాలని సిబ్బందికి సూచించారు. గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధచూపాలని, రోగాలు వ్యాపించ కుండా తగు జాగ్రత్తలను పాటించాలన్నారు. సచివాలయాల సిబ్బంది విధులపట్ల ఆలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ బ్రహ్మానందరెడ్డి, కార్యదర్శులు శ్రీహరి, నిస్సార్, సిబ్బంది పాల్గొన్నారు.

రోగులతో దురుసుగా ప్రవర్తించొద్దు

● డీఎంహెచ్‌వో నాగరాజు



పి.కొత్తపల్లె పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

సిద్దవటం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అలసత్వం చేస్తే చర్యలు తప్పవని కడప డీఎంహెచ్‌వో నాగరాజు సిబ్బందిని హెచ్చరించారు. మండలంలోని పి.కొత్తపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్య సిబ్బంది తప్పనిసరిగా ఐడీ కార్డు కలిగి ఉండాలని, డ్రెస్ కోడ్ పాటించాలని సూచించారు. కాన్పులవార్డు, రోగుల గదులు, వ్యాక్సినేషన్ సంబంధించిన గదులను తనిఖీ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో విషజ్వరాలు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, పారిశుధ్య పరిరక్షణపై పంచాయతీ కార్యదర్శులకు శ్రద్ధ తీసుకునేలా చూడాలన్నారు. 104 శిబిరాలకు వచ్చే పేషంట్ల రక్త నమూనాలు సేకరించాలని, గర్భిణులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ ప్రవీణ్‌కుమార్, రంగలక్ష్మి, ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

మట్టి తరలింపు అనుమతులు నిషేధం

● ఇరిగేషన్ ఈఈ సురేష్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న ఇరిగేషన్ ఈఈ సురేష్‌బాబు

కురబలకోట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని చెరువుల నుంచి మట్టి తరలింపుపై అనుమతులను నిషేధించినట్లు ఇరిగేషన్ ఈఈ సురేష్‌బాబు పేర్కొన్నారు. జాతీయ రహదారి పక్కనున్న రియల్ ఎస్టేట్ భూముల అభివృద్ధికి వ్యవసాయ భూముల పేరుతో మట్టి తరలింపులో ఇరిగేషన్ అధికారులను బురిడీ కొట్టించి అనుమతులను పొంది చింతమాకులపల్లె పంచాయతీ నార్లపల్లె చెరువు నుంచి మట్టిని తరలించిన విషయం తెలిసిందే. దీనిపై ఆంధ్రజ్యోతిలో మట్టి మాఫియా బరితెగింపు, మట్టి తరలింపులో బురిడీ శీర్షికన కథనాలు ప్రచురితమైంది. కాగా దీనిపై స్పందించిన ఆయన మాట్లాడుతూ నియోజకర్గంలో చెరువులను నింపేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీంతో చెరువుల నుంచి మట్టిని తోలుకోవడానికి అనుమతులను రద్దు చేశామన్నారు. నార్లపల్లె చెరువులో మట్టిని తోలుకోవడానికి ఇచ్చిన అనుమతులను రద్దు చేశామన్నారు. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలని కోరారు.

టపాసులు పేలి టీ కొట్టుకు నిప్పు

వీరబల్లి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాజంపేట టీడీపీ ఇన్‌చార్జి జగన్‌మోహన్‌రాజు వీరబల్లికి విచ్చేసిన సందర్భంగా స్థానిక బస్టాండు ఆవరణలో నేతలు టపాసులు పేల్చారు. దీంతో నిప్పు రవ్వలు ఎగసి పడడంతో టీ కొట్టు 60 శాతానికి పైగా కాలిపోయింది. స్థానికులు మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. కాగా, ఈ ప్రమాదంతో జీవనాధారం కోల్పోయానని, తనను ఆదుకోవాలని టీకొట్టు యజమాని కరీముల్లా కోరుతున్నాడు.

టమోటా నారు... నెల దాటితే నేలపాలు



నెల దాటడంతో పడేసిన టమోటా నారు

● నారు నర్సరీలపై అకాలవర్షాల ప్రభావం

● లబోదిబోమంటున్న నర్సరీల యాజమాన్యం

రాయచోటి (నేతాజీసర్కిల్), సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రైతులకు పంట సాగులో ఆధునిక పద్ధతిలో రెడీమేడ్ విధానాన్ని అందించేవి నారు నర్సరీలు. నర్సరీలలో ప్రధానంగా టమోటా, వంగ, మిరప నారు పిలకలతో పాటు పూల మొక్కల బంతి, చామంతి మొక్కలు పెంచుతూ ఉంటారు. అయితే జిల్లాలో ప్రధానంగా రాయచోటి, తంబళ్లపల్లి, మదనపల్లె, పీలేరు, కలికిరి నియోజకవర్గంలో టమోటా సాగుపై రైతులు మక్కువ చూపుతున్నారు. ఒకప్పుడు టమోటా పంట సాగు కోసం రైతులు నారుమళ్లు తయారు చేసి విత్తనాలు పోసి నారుమడి చుట్టూ పాత చీరలతో కట్టి చుట్టూ ఎత్తయిన రాళ్లతో, టెంకాయ పట్టలతో పందిరి వేసేవారు. 30 నుంచి 45 రోజుల పాటు ప్రతిరోజూ నీరు పోసి నారు సిద్ధం చేసుకునేవారు. దీంతో చాలా ఆలస్యమయ్యేది. అయితే వ్యవసాయంలో మార్పులు రావడంతో నారు నర్సరీలు రైతులకు అందుబాటులోకి వచ్చాయి. సులువైన పద్ధతిలో పంటసాగు జరుగుతుంది. నారు పోసిన తర్వాత మొక్కకు నెల దాటితే అమ్ముడుపోని నారు నేలపాలు కావాల్సిందే అంటున్నారు నర్సరీ యజమానులు. వర్షాలు సకాలంలో కురిస్తేనే నర్సరీల యజమానులకు ఆదాయం ఉంటుందని, లేదంటే నష్టాలు తప్పవని అంటున్నారు. టమోటా నారు ఒక్కో పిలకపై రూ.55 పైసల నుంచి 65 పైసల ఖర్చు వస్తున్నట్లు తెలిపారు. ఒక పిలక ఒక్క రూపాయి అమ్మితే రూ.35 నుంచి 45 పైసలు ఆదాయం వస్తుందని నర్సరీల యజమానులు చెబుతున్నారు. ఈ ఏడాది జూన్, జూలై నెలల్లో వర్షాలు పడకపోవడంతో నారు ముదిరి నేలపాలు చేసినట్లు తెలిపారు. ఒక నారు నర్సరీని బట్టి ఒక నెలలో రూ.8 నుంచి 9 లక్షలు టమోటా నారు వస్తున్నట్లు తెలిపారు. నష్టం రావడంతో లబోదిబోమంటూ ఆవేదన వ్యక్తం చేశారు.



నారు నర్సరీలో సిద్ధంగా ఉన్న టమోటా నారు

ఏడాదికి రెండుసార్లు సాగు

ఈ ప్రాంతంలో రైతులు ఏడాదిలో రెండుసార్లు టమోటా పంట సాగు చేస్తారు. మార్చి, ఏప్రిల్ నుంచి ఎండాకాలం వస్తే చాలు.. రాయచోటి నియోజకవర్గం ప్రాంతంలో కలకడ, సంబేపల్లె, చిన్నమండెం ప్రాంతాలకు చెందిన రైతులు ఎండ తీవ్రతలు అధికంగా ఉండడంతో పంట సాగు కోసం భాకరాపేట, మదనపల్లి, అంగళ్లు, బి.కొత్తకోట ప్రాంతాలకు వెళ్లి పొలం లీజుకు తీసుకుని పంట సాగు చేస్తారు. జూన్, జూలై నెల ఆఖరిలో వర్షాలు పడడంతో అక్కడ పంట పూర్తి చేసుకుని తిరిగి ఇక్కడ జూలై, ఆగస్టు నెలలో పంట సాగులకు సిద్ధం చేస్తారు. ఇలా ఏడాదిలో రెండుసార్లు పంట సాగు చేస్తూ నారు నర్సరీలపై ఆధారపడడంతో నారు నర్సరీ యజమానులకు వ్యాపారం జీవనాధారంగా మారింది.

టమోటా ధరల పతనంతో తగ్గిన సాగు

టమోటా సాగుపై ధరల ప్రభావం పడింది. రాయచోటి నియోజకవర్గంలో సుమారు 2 వేల హెక్టార్లలో టమోటా సాగు చేసేవారు. టమోటా ధరలు వరుసగా 7 నెలలుగా పడిపోవడంతో రైతులు పంట సాగుకు సుముఖత చూపకపోవడంతో పంట సాగు తగ్గిందనే చెప్పవచ్చు. దీంతో కూడా నారు నర్సరీ వ్యాపారంపై ప్రభావం పడింది.

ఈ ఏడాదీ నష్టమే

- సుబ్రమణ్యం, నారు నర్సరీ వ్యాపారి, దేవపట్ల, సంబేపల్లె మండలం



మా నర్సరీలో ఒకసారి 8 లక్షల టమోటా నారు వేస్తాం. ఈ ఏడాది ఒకసారి మాత్రమే నారు అమ్ముడుపోయింది. గతంలో ఏడాదికి రెండుసార్లు నారు అమ్ముడుపోయేది. జూన్, జూలై నెలల్లో వర్షాలు పడకపోవడంతో నారు అమ్ముడుపోలేదు. నారుకు నెల దాటితే ముదిరిపోతుంది. తర్వాత పడేయాల్సిందే. దీంతో నష్టమే. ఉద్యానశాఖ అధికారులు నర్సరీ యజమానులు నష్టాలను గుర్తించి ఆదుకోవాలి.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం

● గ్రామ పంచాయతీ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రామయ్య



పీలేరు మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద కార్మికుల ధర్నా

పీలేరురూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తున్నారని పంచాయతీ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ధనాసి వెంకట్రామయ్య ఆరోపించారు. మంగళవారం పీలేరు పంచాయతీ కార్యాలయం వద్ద కార్మికులు చేపట్టిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ చాలీచాలని జీతాలతో దుర్భర జీవితాలు గడుపుతున్న 46 మంది పంచాయతీ పారిశుధ్య కార్మికుల జీతాల్లో నెలకు రూ. 1000 చొప్పున తగ్గించడం ఏమిటని ప్రశ్నించారు. ఏవరూ చేయని పని చేస్తున్న కార్మికుల కడుపు కొట్టడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చే రూ. 13,500లలో రూ. వెయ్యి తగ్గిస్తే ఏమి తినాలి ఎలా బతకాలని ప్రశ్నించారు. ఇదే విషయం డీపీఓ రాధమ్మ దృష్టికి తీసుకెళ్లగా ఇలా ఎవరు చేయమన్నారని ప్రశ్నించారని తెలిపారు. అయినా పంచాయతీ అధికారుల్లో ఎటువంటి చలనం కానరావడం లేదని తెలిపారు. గతేడాది ఏప్రిల్, మే నెలల జీతాలు 46 మంది కార్మికులకు ఇవ్వాలని, పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా మీనమేషాలు లెక్కిస్తున్నారని ఆరోపించారు. ఇంకెప్పుడిస్తారో అంతా అయోమయ పరిస్థితులు నెలకొన్నాయని వాపోయారు. ప్రతి నెలా పంచాయతీ కార్మికులను 300 గ్రాముల కొబ్బరి నూనె, రెండు సోపులు ఇస్తారని, ఎనిమిది నెలలుగా నూనె, సోపులు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు ఒక్కొక్కరి పీఎఫ్ ఖాతాలో ఆరు నెలల డబ్బు జమ చేయకుండా పెండింగ్ పెట్టారని, వీటిని ఎప్పుడు జమచేస్తారో ఎవరిని అడిగినా సరైన సమాధానం చెప్పడంలేదని వాపోయారు. పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్య ధోరణి అవలంభించడం శోచనీయమని విమర్శించారు. సంబంధిత అధికారులు స్పందించకపోతే తమ ఆందోళన కార్యక్రమాలను అందరి సంఘీబావంతో ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పంచాయతీ కార్మికులకు 2025-2026కు యూనిఫాం సత్వరం ఇవ్వాలని ఏప్రిల్‌లో పంచాయతీ బోర్డు ఆమోదం తెలిపినా ఇప్పటి వరకూ ఇవ్వలేదన్నారు. మూడు పూటలూ గడవడం గగనమైన పారిశుధ్య కార్మికులకు ఇవ్వాల్సిన నూనె, సోపులు, దుస్తులు, పెండింగ్ జీతాలు, పీఎఫ్ తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. అధికారుల నిర్లక్ష్య వైఖరికి నిరసనగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. కార్యక్రమంలో యూనియన్ నేతలు బీ.వీ.రమణ, పులి రెడ్డెప్ప, నాగార్జున, రమేష్, చిట్టెమ్మ, రాణెమ్మ, రాజేశ్వరి, శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్యం సివిల్ సర్జన్ స్పెషలిస్టులుగా పదోన్నతులు

కలికిరి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సిద్దవటం మండలం పొన్నూలు కొత్తపల్లె పీహెచ్‌సీలో పనిచేస్తున్న డాక్టర్ జె.ప్రవీణ్ కుమార్‌కు కంటి వైద్యం సివిల్ సర్జన్ స్పెషలిస్టుగా పదోన్నతి కల్పించారు. కడప ఎన్‌పీసీబీ సంచార కంటి వైద్యం యూనిట్‌కు బదిలీ చేశారు. అదేవిధంగా అన్నమయ్య జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో డీపీఎంఓగా పనిచేస్తున్న డాక్టర్ ఎం.రియాజ్‌బేగ్ సివిల్ సర్జన్ స్పెషలిస్ట్‌గా పదోన్నతి కల్పించి చిత్తూరు జిల్లా వైద్యశాలకు బదిలీ చేశారు. ఈ మేరకు రాష్ట్ర ఆరోగ్య, వైద్య కుటుంబ సంక్షేమ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు మంగళవారం ఆదేశాలు జారీ చేశారు.

12న అండర్-19 ఫుట్‌బాల్ జట్ల ఎంపిక

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో 12వ తేదీన శుక్రవారం ఉమ్మడి చిత్తూరు జిల్లా అండర్-19 ఫుట్‌బాల్ జట్ల ఎంపిక నిర్వహిస్తున్నట్లు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శులు నాగరాజ, ఝాన్సీ, డాక్టర్ బాబు, సరిత, కిషోర్, భార్గవి తెలిపారు. ఎంపికకు వచ్చే క్రీడాకారులు ఆరో తరగతి నుంచి ఇంటర్ మధ్య చదువుతుండాలన్నారు. 2007 జనవరి ఒకటో తేదీ తరువాత జన్మించి ఉండాలని తెలిపారు. తమ వెంట ఇంటర్ చదువుతున్న వారు టెన్త్ ఒరిజనల్ సర్టిఫికెట్లు, క్రీడా యూనిఫామ్స్‌తో సెలక్షన్‌లో పాల్గొనాలని సూచించారు.

ప్రొద్దుటూరు సబ్ డీఎఫ్ఓగా సునీల్

కలికిరి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు అటవీ శాఖ సబ్ డీఎఫ్ఓగా గరుడ్ సాంకేత్ సునీల్‌ను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. 2023 ఐఎఫ్ఎస్ అధికారి అయిన సాంకేత్ శిక్షణ ముగించుకోవడంతో ఆయనను ప్రొద్దుటూరులో నియమించారు. ఈ మేరకు సాధారణ పరిపాలనా శాఖ ముఖ్య కార్యదర్శి కె.విజయానంద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

వాళీశ్వరస్వామి కొండలో క్లూస్ టీమ్



ఆలయ ముఖద్వారం పరిశీలిస్తున్న క్లూస్ టీమ్

రామసముద్రం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రామసముద్రం మండలం ఆర్.నడింపల్లె గ్రామ పంచాయతీ బల్లసముద్రం వాళీశ్వరస్వామి కొండలో మంగళవారం మదనపల్లె క్లూస్ టీమ్ పోలీస్ అధికారులు వేలిముద్రలు, ఆధారాలను సేకరించారు. వాళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం గుప్తనిధుల కోసం ఆలయాన్ని ధ్వంసం చేసిన సంగతి విధితమే. ఆలయ అర్చకులు లోకనాథ్ దీక్షిత్, ఈఓ రమణ, పోలీసులకు ఫిర్యాదు చేయగా స్పందించిన రామసముద్రం ఎస్ఐ రమేష్ బాబు ఆదేశాలతో క్లూస్ టీమ్ ఆధారాలు సేకరించడానికి వచ్చి కొండలో అణువు అణువు పరిశీలించారు. కార్యక్రమంలో అధికారులు, అర్చకులు లోకనాథ్ దీక్షితులు, కానిస్టేబుల్ పురుషోత్తం, నల్లప్పగారి పల్లె గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

భూములను సద్వినియోగం చేసుకోండి



దేవదాయశాఖ అధికారికి వినతిపత్రం ఇస్తున్న బి.కొత్తకోట నేతలు

బి.కొత్తకోట, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నల గంగమ్మ మాన్యం భూములను సద్వినియోగం చేసుకొని ఆలయ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని జిల్లా దేవదాయశాఖ అధికారులకు బి.కొత్తకోట బీజేపీ నేతలు విన్నవించారు. మంగళవారం జిల్లా దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించిన వీరు మాట్లాడుతూ పట్టణంలోని బెంగళూరు రోడ్డులో రూ.కోట్ల విలువైన వాణిజ్య భూములను ఏళ్ల తరబడి గంపగుత్తగా నామమాత్రపు అద్దెకు ఇచ్చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ మండల కన్వీనర్ ముకుందబాబు, రమేష్, మురళి, రాము, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

అధిక యూరియా పంటకు అనర్థం

● జిల్లా వ్యవసాయాధికారి శివన్నారాయణ



రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి శివన్నారాయణ తదితరులు

బి.కొత్తకోట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వరితో పాటు ఏ పంటకైనా అధిక మోతాదులో యూరియా వినియోగం అనర్థదాయకమని జిల్లా సంచాలకులు శివన్నారాయణ పేర్కొన్నారు. మంగళవారం కోటావూరు గ్రామంలో తోటి అధికారులతో కలిసి పొలంపిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు. యూరియా అధికమోతాదుతో నేలలో క్షార శాతం పెరిగిపోతుందని, భూమి నిస్సారం అవుతుందన్నారు. దానికి బదులు సంప్రదాయ పద్ధతులను అవలంబించి, సారవంతమైన ఎరువులను ఉపయోగించి, రసాయన ఎరువుల వాడకాన్ని క్రమక్రమంగా తగ్గించాలన్నారు. లీడ్‌బ్యాంక్ మేనేజర్ ఆంజనేయులు మాట్లాడుతూ కౌలు రైతులకు బ్యాంకుల్లో పంటరుణాలు ఇచ్చి తీరాలని, అలా కాకుండా ఏ బ్యాంకు శాఖలోనైనా ఇవ్వకపోతే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. మనుషుల ఆధార్ లాగే పశువులకు కూడా గుర్తింపుకార్డును ఇస్తున్నామని రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ రాయితీలను పొందాలన్నారు. పలువురు రైతులు తమ సమస్యలను జిల్లా అధికారులకు వన్నవించారు. కార్యక్రమంలో బి.కొత్తకోట ఏఓ చంద్రశేఖర్, సచివాలయాల వ్యవసాయశాఖ ఉద్యోగులు మల్లికార్జున, అంజి, సునీత తదితరులు పాల్గొన్నారు.

చెప్పిందే కొలత.. పల్లెవాసి కలత

● సర్వేయర్లు లేకుండా స్వామిత్వ కార్యక్రమం

● సర్వేలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు

● ఇప్పటికే జరుగుతున్న సర్వే



సర్వేయర్ లేకుండా కొలతలు తీస్తున్న పంచాయతీ కార్యదర్శి, ఇంజనీరింగ్ అసిస్టెంట్

సుండుపల్లె, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎక్కువ శాతం గ్రామాల్లో ఇప్పటికీ తమ నివాసాలకు ఆస్తి పత్రాలు లేక, కొలతలు తెలియక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను చక్కదిద్దేందుకు స్వామిత్వ కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం చేపట్టింది. పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో ఇంటింటా సర్వే చేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి, గ్రామ రెవెన్యూ అధికారి, సర్వేయర్, ఇంజనీరింగ్, డిజిటల్ సహాయకులు బృందంగా వెళ్లి సర్వే చేపట్టాలి. కానీ సుండుపల్లె మండలంలో ప్రస్తుతం జరుగుతున్న స్వామిత్వ కార్యక్రమం పంచాయతీ కార్యదర్శి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ మాత్రమే వెళ్లి సర్వే చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో లోపభూయిష్టంగా జరుగుతున్నట్లు గ్రామీణులు ఆరోపిస్తున్నారు.



కొలతల పూర్తి వివరాలు సేకరిస్తున్న పంచాయతీ కార్యదర్శి

రోవర్లు ఉపయోగించకుండా

ప్రధానంగా ఇళ్ల స్థలాలకు కొలతలు వేసే సమయంలో రోవర్లు ఉపయోగించాలి. అవి లేకుండా ప్రక్రియ సాగుతోంది. టేపులతో కొలతల వల్ల తమ ఆస్తులకు సంబంధించి తేడాలు వస్తాయని పలువురు చెబుతున్నారు. వీఆర్‌వోలు ఇతర పనుల పేరుతో సరిగ్గా హాజరుకాకపోవడం, అసలు సర్వేయర్లు కార్యక్రమాలకు దూరంగా ఉండటంతో ఖాళీ స్థలాలకు హద్దులు తెలియక ఇంటి యజమాని ఏది చెబితే అదే పరిగణలోకి తీసుకుంటున్నారు. దాంతో గ్రామాల్లో వివాదాలు తెలెత్తే అవకాశాలు ఉన్నాయి. సుండుపల్లె, పెద్దినేనికాలువ, చిన్నగొల్లపల్లి, పొలిమేరపల్లె, భాగంపల్లితో పాటు మరికొన్ని గ్రామ పంచాయతీల్లో స్వామిత్వ సర్వే జరుగుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి లోపాలు సవరించి సర్వే సక్రమంగా సర్వేయర్లతో జరిగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

అనుభవం లేని వారికి బాధ్యతలు

కేంద్రం పంచాయతీరాజ్‌శాఖ పల్లెల్లో స్వామిత్వ సర్వే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పథకానికి సంబంధించి ఇంటింటా కొలతలు వేయాలన్నా, రికార్డుల్లో నమోదు చేయాలన్నా సర్వేయర్ పాత్రే కీలకం. అలాంటి వారు లేకుండా అనుభవం లేని గ్రామ సహాయక ఇంజనీర్లకు బాధ్యతలను అప్పగించారు. దాంతో కొలతలు తీయడంలో లోపాలు తలెత్తుతున్నాయి. కొందరు అనుభవం ఉన్న సర్వేయర్లను పక్కన బెట్టారు. పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో సాగాల్సిన అభివృద్ధి పనుల్లో నిమగ్నం కావాల్సిన ఇంజనీరింగ్ సహాయకులు ఆ పనులను పక్కనబెట్టి అనుభవం లేని సర్వే పనులకు వెళ్తున్నారు. దాంతో పనులు ఆగిపోతున్నాయని పీఆర్ అధికారులు లబోదిబోమంటున్నారు.

సమస్య వస్తేనే సర్వేయర్లు

- రాధమ్మ, డీపీవో

సమస్య వస్తే సర్వేయర్లు వచ్చి కొలిచి సమస్య పరిష్కరిస్తారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు వచ్చి పొడవు, వెడల్పు నమోదు చేస్తున్నారు. పూర్తి వివరాలు సేకరిస్తున్నారు. సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాము.

కోడిగాండ్లపల్లెలో విజృంభిస్తున్న విషజ్వరాలు

- ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసినా.. అదుపులోకి రాని వైనం
- కర్నూలు, తాడిపత్రి, ప్రొద్దుటూరు ఆసుపత్రుల్లో చికిత్స
- గండికోట బ్యాక్‌వాటర్‌తోనే సమస్య

ముద్దనూరు సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కోడిగాండ్లపల్లెలో విషజ్వరాలు రోజు రోజుకు విజృంభిస్తున్నాయి. వైద్యాధికారులు గ్రామంలో పర్యటించి, వైద్య శిబిరాలు ఏర్పాటు చేసిన జ్వరాలు అదుపు చేయలేని పరిస్థితి నెలకొంది. ఈ గ్రామంలో 20 రోజులుగా విషజ్వరాలు పట్టి పీడిస్తున్నాయి. దాదాపు 30 నుంచి 40 మంది పిల్లలు జ్వరాల బారిన పడ్డారు. 15 సంవత్సరాలలోపు పిల్లలకు ఎక్కువగా జ్వరాలు వస్తున్నాయి. చాలా మంది పిల్లలకు రక్త కణాలు తగ్గిపోతుండటంతో డెంగ్యూ జ్వరాలు వస్తు న్నాయి. దీంతో కొందరు ముద్దనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో, మరికొందరు కర్నూలు, ప్రొద్దుటూరు, తాడిపత్రిలలోని ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారు. కాగా, గత కొద్ది రోజుల నుంచి గ్రామంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో, మలేరియా అధికారులు, మెడికల్ క్యాంపులు నిర్వహించి వైద్య పరీక్షలు చేస్తున్నా జ్వరాలు అదుపు చేయలేని పరిస్థితులు ఉన్నాయి. గండికోట బ్యాక్ వాటర్ గ్రామానికి అతీసమీపంలో ఉండటంతో దోమలు విపరీతంగా ఉన్నాయి. దీంతో జ్వరాలు ప్రబలుతున్నాయని ప్రజలతో పాటు వైద్యాధికారులు చెబు తున్నారు. కొద్ది రోజుల క్రితం ఓ చిన్నారి విషజ్వరంతో మృతి చెందినట్లు ప్రజలు చెబుతున్నారు. గ్రామంలో ఉన్నతాధికారులు పర్యటించి తమను జ్వరాల బారి నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

బ్యాక్‌వాటర్‌తోనే సమస్య

మాగ్రామం సమీపంలో గండికోట డ్యాం బ్యాక్‌వాటర్ నిల్వ ఉండటంతో దోమలు విపరీతంగా ఉన్నాయి. పిల్లలకు దోమలు కుట్టడంతో జ్వరాలు వస్తున్నాయి. అధికారులు సమస్యను పరిష్కరించాలి.
మౌనిక, కోడిగాండ్లపల్లె


కోడిగాండ్లపల్లె గ్రామ సమీపంలో ఉన్న గండికోట బ్యాక్‌వాటర్



ఏడుగురికి డెంగ్యూ

కోడిగాండ్లపల్లెలో విషజ్వరాలు ఉన్నాయి. 13మంది తీవ్రజ్వరంతో బాధపడుతున్నారు. పరీక్షలు చేయగా ఏడుగురికి డెంగ్యూ పాజిటివ్ నిర్ధారణ అయ్యింది. తాడిపత్రి, కర్నూలు ప్రాంతాల్లో వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారు. ఇద్దరు రికవరీ అయ్యారు. గ్రామానికి అతిసమీపంలో గండికోట బ్యాక్ వాటర్ నిల్వ ఉంది. గ్రామంలో నీటి తొట్టెలు, పాత టైర్లలో నీరు నిల్వ ఉండటం వల్ల లార్వా చేరుతుంది. పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచనలు ఇచ్చాం. మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నాం.

-గీత, డిప్యూటీ డీఎంహెచ్‌వో




ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి

కొమ్మినేని శ్రీవిద్యకు గోల్డ్‌మెడల్



గవర్నర్ చేతులమీదుగా గోల్డ్‌మెడల్ అందుకుంటున్న కొమ్మినేని శ్రీవిద్య

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మాజీ కార్పొరేటర్, ప్రముఖ న్యాయవాది, మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కొమ్మినేని వెంకటసుబ్బయ్య కుమార్తె కొమ్మినేని శ్రీవిద్య ఎమ్మెస్ ఈఎన్‌టీలో రాష్ట్రస్థాయి ప్రథమర్యాంకు సాధించారు. మూడు బంగారు పతకాలు, అవార్డులు కూడా సొంతం చేసుకున్నారు. ప్రస్తుతం ఆమె కడప రిమ్స్‌లో సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా కొనసాగుతున్నారు. మంగళవారం విజయవాడ డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయంలో వార్షికోత్సవం పురస్కరించుకొని గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతులు మీదుగా మూడు గోల్డ్‌మెడల్స్, రెండు ప్రజెంటేషన్స్ అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్‌చాన్సెలర్ డాక్టర్ పి.చంద్రశేఖర్, డాక్టర్ వేమిరెడ్డి పాల్గొన్నారు. కొమ్మినేని శ్రీవిద్య గోల్డ్‌మెడల్ సాధించడం పట్ల బండి బాబుమూర్తి, బాలకృష్ణ, బండారు సత్య, అప్పిశెట్టి వెంకటేశ్వర్లు, పీఎస్ ఇంతియాజ్ అహ్మద్‌లు శుభాకాంక్షలు తెలిపారు.

టిప్పరు ఢీకొని యువకుడి మృతి



ఖాజీపేట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కడప-కర్నూలు జాతీయ రహదారిలోని అయ్యప్పస్వామి గుడి సమీపంలో స్కూటర్‌ను టిప్పర్ ఢీకొన్న సంఘటనలో కె.వెంకటసుబ్బయ్య (21) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు అల్లాడుపల్లె వద్ద జరుగుతున్న ఐటీఐ నిర్మాణ పనుల కోసం నాగసానిపల్లె నుంచి మట్టి తీసుకెళ్లేందుకు వస్తున్న టిప్పర్ అయ్యప్పస్వామి గుడి సమీపంలోకి రాగానే స్కూటర్‌ను ఢీకొంది. దీంతో వెంకటసుబ్బయ్య బ్రిడ్జిపై నుంచి కింద పడటంతో గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం హైవే సిబ్బంది రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఇతను చాపాడు మండలం పల్లవోలు గ్రామానికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు.

లారీ ఢీకొని వృద్ధుడు...

చాపాడు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విశ్వనాథపురం గ్రామ సమీపంలో కొత్తగా నిర్మిస్తున్న బ్రిడ్జి వద్ద మైదుకూరు-ప్రొద్దుటూరు జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి 9 గంటల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో లెక్కల లక్ష్మిరెడ్డి (64) మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. సోమాపురం గ్రామానికి చెందిన లక్ష్మిరెడ్డి మైదుకూరు నుంచి సోమాపురానికి మోటారు సైకిల్‌పై వెళుతూ రోడ్డు దాటుతుండగా ప్రొద్దుటూరు వైపు నుంచి వచ్చిన లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పోక్సో కేసులో ఒకరి అరెస్టు

కడప క్రైం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల చిన్నారిపై అత్యాచారయత్నానికి పాల్పడిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తాలుకా ఎస్‌ఐ తులసి నాగ ప్రసాద్ తెలిపారు. ఎస్‌ఐ వివరాల మేరకు... తాలుకా పోలీ సుస్టేషన్ పరిధిలోని రౌడీషీటరు రాజ్‌కుమార్ ఈనెల 7న ఐదేళ్ల చిన్నారికి చాక్లెట్ ఇచ్చి తన ఇంట్లోకి తీసుకెళ్లి అత్యాచారయత్నం చేశాడు. ఈకేసుకు సంబంధించి మంగళవారం నిందితున్ని అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అదుపుతప్పి బోల్తా పడ్డ కారు



కాశినాయన సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) మండలంలోని వరికుంట్ల సమీపంలోగల జ్యోతి రోడ్డులో కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు.. కడప పట్టణానికి చెందిన ముగ్గురు యువకులు కారులో జ్యోతి క్షేత్రానికి వెళ్లి కాశి నాయనను దర్శించుకొని తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమ ధ్యలో వరికుంట్ల గ్రామ సమీపంలోని ఊరబోడు వద్ద ఉన్న మలుపులో కారు అదుపుతప్పి పొలాల్లో బోల్తా పడింది. దీంతో కారులో ఉన్న ముగ్గురిలో ఒకరికి స్వల్ప గాయాలైనట్లు తెలిసిం ది. ప్రమాదంలో కారు బాగా దెబ్బతింది. మద్యం తాగి వాహ నం నడపడంతో ఒకరిని పోలీసులు అదుపులోకి తీసుకోగా.. ఇద్దరు పరారైనట్లు తెలిసింది.

వ్యవసాయ కూలీలకు భూపంపిణీ చేపట్టాలి

- వ్యవసాయ కార్మిక సంఘం అఖిలభారత అధ్యక్షుడు విజయరాఘవన్



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం అఖిలభారత అధ్యక్షుడు విజయరాఘవన్

కడప సెవెన్‌రోడ్స్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సాగు భూముల్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడంతో వ్యవసాయరంగం సంక్షోభంలోకి నెట్టబడుతోందని వ్యవసాయ కార్మిక సంఘం అఖిలభారత అధ్యక్షుడు విజయరాఘవన్ అన్నారు. మంగళవారం కడప హరిత హోటల్ ఆవరణలో జాతీయ సమావేశాలలో మాట్లాడుతూ భూ పంపిణీ, సాగునీరు, ఉపాధి హామీ పనుల కోసం వ్యవసాయ కార్మికులు ఉద్యమించి పోరాడాలని పిలుపునిచ్చారు. పాలకులు విదేశీ పెట్టుబడులపై ఆధారపడి ఊహాజనితమైన పథకాలతో భూములు సేకరించి వ్యవసాయాన్ని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తున్నారన్నారు. రైతులను, వ్యవసాయ కూలీలను అభద్రతకు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ధ్వజమెత్తారు. సాగు భూమి తగ్గడంతో వ్యవసాయం సంక్షోభంలోకి వెళ్లి గ్రామీణ ఉపాధి పడిపోయి వలసలు పెరుగుతున్నాయన్నారు. ఉపాధి లేక ప్రజల కొనుగోలు శక్తి తగ్గి పారిశ్రామిక ఉత్పత్తి పడిపోతుందన్నారు. భూమితో సహా ప్రకృతి సంపద కార్పొరేట్లపరం అవుతోందని... తద్వారా ఆర్థిక సామాజిక అసమానతలు తీవ్రంగా పెరుగుతున్నాయని... బలవంతపు భూసేకరణ ప్రయత్నాలు విరమించుకోవాలన్నారు. సమావేశంలో అఖిల భారత రైతు సంఘం ప్రధాన కార్యదర్శి విజుకృష్ణ, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కార్యదర్శి వెంకట్, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు దడాల సుబ్బారావు, వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శివకుమార్, అన్వేష్, ఉపాధ్యక్షుడు జి.చంద్ర శేఖర్, కార్యదర్శి దస్తగిరిరెడ్డి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి మనోహర్, జిల్లా ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి


ఆర్టీపీపీ సీఈకి వినతిపత్రం ఇస్తున్న జేఏసీ నాయకులు

ఎర్రగుంట్ల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఏపీ జెన్‌కోలో పనిచేస్తున్న ఉద్యోగ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని జేఏసీ కోరింది. ఈ మేరకు ఆర్టీపీపీ చీఫ్ ఇంజినీర్‌కి ఏపీఎస్‌పీఈ జేఏసీ నాయకులు మంగళవారం వినతిపత్రం ఇచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఏపీ జెన్‌కో ఉద్యోగుల, కార్మికుల సమస్యలను వారు వినతి పత్రంలో పేర్కొన్నారు. వీటన్నింటిపై యాజమాన్యం తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్మికుల హక్కుల, సంక్షేమంపై ఉదాసీనత సరికాదన్నారు.

‘అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి’

పులివెందుల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా అనుచితవ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై వెంటనే చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వంగల శశిభూషణ్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని నగరిగుట్టకు చెందిన ఓ వ్యక్తి హిందూ దేవుళ్లను కించపరు స్తూ మాటాడారన్నారు. మంగళవారం ఆ వ్యక్తిని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించి.. జరిగిన విషయాన్ని డీఎస్పీకి తెలియజేశామన్నారు. దీనికి డీఎస్పీ స్పందిస్తూ విచారణ చేసి... తప్పు జరిగినట్లు రుజువు అయితే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపటి నుంచి అండర్-19


జిల్లా స్కూల్‌గేమ్స్ ఎంపికలు


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

కడప స్పోర్ట్స్, సెప్టెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మొదటి విడతగా ఈనెల 11వ తేదీ గురువారం నుంచి 17 వరకు స్కూల్‌గేమ్స్ ఎంపికల ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్‌జీఎఫ్ అండర్-19 అధ్యక్షుడు టీఎన్‌వీ వెంకటేశ్వర్లు, కార్యదర్శి ఎం.చంద్రమోహన్‌రాజు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక బాలికల కళాశాలలో నిర్వహించిన వ్యాయామ ఉపాధ్యాయుల, ఫిజికల్ డైరెక్టర్ల సమావేశంలో వారు మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలోని జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్, వ్యాయామ ఉపాధ్యాయులు, ప్రణాళికాబద్ధంగా షెడ్యూల్‌కు అనుగుణంగా ఎక్కువ మంది క్రీడాకారులు పాల్గొనేలా చూడాలని కోరారు. ఈ నేపథ్యంలో కడప వైయస్ఆర్ క్రీడా పాఠశాలలో 11వ తేదీ మోడరన్ పెంథలాన్, స్విమ్మింగ్, పోటీలు జరుగుతాయని తెలిపారు.

ఏడుగురు జూదరుల అరెస్టు

కడప క్రైం, సెప్టెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ఉక్కాయపల్లె డంపుయార్డు సమీపంలో జూదమాడుతున్న ఏడుగురిని చిన్నచౌకు పోలీసులు అరెస్టు చేశారు. కడపకు చెందిన ఏడుగురు జూదమాడుతుండగా అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.75వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు.



కూలీల ఆటో బోల్తా...ఇద్దరు మృతి

- నలుగురికి గాయాలు

చక్రాయపేట/తనకల్లు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కూలి చేసుకుని వెళ్తున్న కష్టజీవుల ప్రయాణం విషాదాంతమైంది. రోడ్డు ప్రమాదం వారిని కబళించింది. కుటుంబాల్లో కన్నీళ్లు నింపింది. శ్రీసత్యసాయి జిల్లా తనకల్లు మండలం కొక్కంటి గ్రామ సమీపాన తుమ్మలవాండ్లపల్లి వద్ద మంగళవారం సాయంత్రం ఆటో బోల్తాపడింది. ప్రమాదంలో కడప జిల్లా చక్రాయిపేట మండలం బురుజుపల్లికి చెందిన కూలీలు హేమలత (35), దేవనాథ్ (40) మృతి చెందారు. గంగులప్పకు తీవ్రగాయాలు కాగా, మరో ముగ్గురు గాయపడ్డారు. ఎస్‌ఐ గోపి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కడప జిల్లా చక్రాయిపేట మండలంలోని కొండప్పగారిపల్లి, ఆంజనేయపురం, బురుజుపల్లి గ్రామాలకు చెందిన 22 మంది కూలీలు మండలంలోని అగ్రహారం పల్లి వద్దకు టమోటా తొలగింపు పనులకు వచ్చారు. పనులు ముగించుకుని తిరిగి స్వగ్రామానికి ఆటోలో బయల్దేరారు. తుమ్మలవాండ్లపల్లి సమీపాన డ్రైవర్ నిర్లక్ష్యం, అతివేగం కారణంగా ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. గాయపడిన వారిని తనకల్లు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ హేమలత (35), దేవనాథ్ (40) మృతిచెందారు. మరో నలుగురు చికిత్స పొందుతున్నారు. ప్రమాదంపై కేసు నమోదు చేసుకుని, శవాలను కదిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించనున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



దేవనాథ, హేమలత మృతదేహాలు



ప్రమాదానికి గురైన ఆటోను పరిశీలిస్తున్న పోలీసులు , ప్రమాద స్థలంలో చెల్లాచెదురుగా పడిపోయిన కూలీల సామగ్రి

విజయదుర్గాదేవి ఆలయంలో రాహుకాల పూజలు



రాహుకాల పూజలు చేస్తున్న భక్తులు, అలంకారంలో విజయదుర్గాదేవి

కడప కల్చరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నగర బిల్టప్ సమీపంలో వెలసిన విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం ఘనంగా రాహుకాల పూజలు నిర్వహించారు. సన్నిధిలో రాహుకాల సమయంలో నిమ్మకాయలతో కూడిన దీపాలను వెలిగించి పూజలు చేశారు. జిల్లా నలుమూలల నుంచే కాకుండా రాయలసీమ ప్రాంత నాలుగు జిల్లాల నుంచి మహిళా భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

పిల్లలు లేని వారికి దత్తత ఒక వరం

కడప ఎన్టీఆర్ సర్కిల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పిల్లలు లేని వారికి పిల్లలను పొందటం ఒక వరమని, మాతృత్వం పొందాలనుకోవడం ప్రతి దంపతుల కోరిక అని అలాంటి కోరికను దత్తత కార్యక్రమం ద్వారా బిడ్డలు పొందే వరాన్ని ప్రభుత్వం కల్పిస్తోందని శిశు గృహ మేనేజరు కుమారి అన్నారు. మంగళవారం స్థానిక కొండాయపల్లెలోని అంగన్వాడీ కేంద్రంలో కడప నగరంలోని అంగన్వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శిశు గృహ మేనేజరు మాట్లాడుతూ దత్తత కార్యక్రమాన్ని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ద్వారా నిర్వహిస్తున్నదన్నారు. ఈ దత్తతను నియమనిబంధనల ప్రకారం చట్టబద్ధమైన దత్తత తీసుకోవాలని, ఈ దత్తతను కలెక్టరు ద్వారా చట్టబద్ధమైన దత్తత ఇవ్వడం జరుగుతుందన్నారు. అనధికారికంగా దత్తత తీసుకోవడం చట్టరీత్యా నేరం అవుతుందని, చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. దత్తత పొందాలనుకునే వారు ఎవరైనా ఉంటే ప్రత్యేక దత్తత సంస్థ (శిశు గృహ) లేదంటే జిల్లా సమగ్ర బాలల పరిరక్షణ విభాగం, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ,సాధికారత అధికారి, స్త్రీ శిశు అభివృద్ధి సంస్థ, కడప కార్యాలయం డీబ్లాక్, కొత్త కలెక్టరేట్ ,కడప వారిని సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజరు మాబుచాన్, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

డెంగీ బాధితులకు పరామర్శ



లార్వాను పరిశీలిస్తున్న డాక్టర్ శ్రీనివాసులు

కడప కలెక్టరేట్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆలంఖాన్‌పల్లి,తిలక్ నగర్‌లో డెంగీ జ్వరాలతో బాధపడుతున్న వారి కుటుంబాలను జోనల్ మలేరియా అధికారి డాక్టర్ శ్రీనివాసులు మంగళవారం సందర్శించారు. పేషంట్ ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకొని తగు సలహాలు,సూచనలు చేశారు.అనంతరం యుపీహెచ్‌సీని తనిఖీ చేసి ల్యాబ్ రికార్డులను పరిశీలించారు. ఈకార్యక్రమంలో మెడికల్ ఆఫీసరు డాక్టర్ లిఖిత, ఆరోగ్యవిస్తర్ణాధికారి నిత్య పూజయ్య, సబ్ యూనిట్ అధికారి నాగలక్ష్మీ రెడ్డి, జోనల్ మలేరియా కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

'ఆర్టీసీ బస్టాండ్ అద్దె రూముల టెండర్లలో దళితమహిళకు అన్యాయం'



మాట్లాడుతున్న దళిత సంఘాల నాయకులు

కడప మారుతీనగర్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కడప బస్టాండ్‌లో ఉన్న అద్దె రూముల టెండర్లలో దళిత మహిళ (స్రవంతి)కు తీవ్ర అన్యాయం జరిగిందని తక్షణమే ఆమెకు తగు న్యాయం జరిగేలా చూడాలని బహుజన్ సమాజ్ పార్టీ, దళిత సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ మేరకు మంగళవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ఆమెకు కేటాయించకుండా నిలుపుదల చేసిన రూముల వద్ద ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ విషయం కలెక్టర్, జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళగా జాయింట్ కలెక్టర్ స్పందించి ఆ మహిళకు న్యాయం జరిగేలా అద్దె భవనాలు కల్పించేలా చూడాలని ఆర్టీసీ ఆర్ఎంను ఆదేశించారన్నారు. బస్టాండ్‌లో లేని స్థలానికి టెండర్ వేసి నిరుద్యోగ మహిళను మోసం చేశారని ఆర్టీసీ ఏఈ బదులిచ్చారన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు సగిలి గుర్రప్ప, దళిత సంఘాల నాయకులు ఆంజనేయులు, చిన్న సుబ్బరాయుడు, పెద్ద సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పట్ల కఠినంగా వ్యవహరించండి

పులివెందుల రూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పులివెందులలో శాంతిభద్రతలను కాపాడడం కోసం కఠినంగా వ్యవహరించాలని బీజేపీ నాయకులు కోరారు.మంగళవారం ఇటీవల అర్బన్ సీఐగా బాధ్యతలు చేపట్టిన సీఐ సీతారామిరెడ్డిని బీజేపీ నాయకులు వాజ్‌పేయి, తిరుపాల్‌రెడ్డిలు శాలువతో సత్కరించారు. "బికమ్ ద డివైన్ యు" అనే పుస్తకాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించాలి

పెండ్లిమర్రి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి):ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతతో పాటు,వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఎంపీడీవో జగన్ మోహన్ రెడ్డి తెలిపారు. గంగనపల్లె పంచాయతీ లోని నీరుకోన యానాది కాలనీలో సోమవారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు.

మురుగునీరు పోయే దారేది..!

- ప్రొఫెసర్స్ కాలనీలో కాలువలు పూడ్చడంతోనే సమస్య
- పట్టించుకోని అధికారులు

సీకేదిన్నె, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): చింతకొమ్మదిన్నె మండలం కార్పొరేషన్‌లో విలీనమైన 18వ డివిజన్‌లోని ప్రొఫెసర్స్ కాలనీలో మురుగునీటి సమస్య వేధిస్తోంది. అయినప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు వాపోతున్నారు. మురుగునీటికి కాలువలు ఏర్పాటు చేసినప్పటికీ కొందరు కాలువల ద్వారా పోయే మురుగునీటిని ఆపడంతో సమస్య జటిలమైంది. మురుగునీరు పోయేందుకు దారిలేక ఎటుపడితే అటు అడ్డంగా ప్రవహిస్తూ ఇబ్బందులకు గురిచేస్తోంది. దీంతో ప్రజలు దుర్వాసన భరించలేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగునీరు పోయేందుకు మార్గం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

- **మూసివేయడంతోనే సమస్య..:** రైల్వే ట్రాక్ సమీపంలో వెంచర్ నిర్వాహకులు మురుగునీరు పోయే తూమును పూడ్చివేశారు. దీంతో నీరు పోయేందుకు దారి లేక ప్రైవేటు స్థలాల్లో పారుతోంది. దీంతో దోమలు దుర్వాసన భరించలేక ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాక కీటకజనిత వ్యాధులతో ఆస్పత్రిపాలై వేల రూపాయలు ఖర్చు పెట్టుకోవాల్సి వస్తోంది.



ఇళ్ల వద్ద నిలిచిన మురుగు

మురుగునీరు పోయేందుకు దారి ఏర్పాటు చేయాలి

మురుగునీరు పోయేందుకు అధికారులు మార్గం చూపాలి. గతంలో ఉన్న కాలువను రైల్వేట్రాక్టర్ వద్ద ఉన్న తూమును పూడ్చివేయడంతో మురుగునీరు పోయేందుకు దారిలేక అడ్డంగా పారుతోంది. అధికారులు చర్యలు తీసుకుని మురుగునీరు పోయేందుకు మార్గం చూపాలి.

- రామమోహన్‌రెడ్డి, సీఎంఆర్‌పల్లి.



కాలువలో పేరుకుపోయిన చెత్త

14న కళాకారుల సమావేశం

కడప కల్చరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కళలకు ఆదరణ లేకపోవడంతో కళాకారులు తీవ్ర మనోవేదనకు గురౌతున్న నేపథ్యంలో తమ కష్టాలను తెలిపేందుకు ఈనెల 14వ తేదీ ఆదివారం ఉదయం 11 గంటలకు నగర మహిళా పోలీస్‌స్టేషన్ పక్కనే ఉన్న డ్రామా ఆర్టిస్ట్ అసోసియేషన్ కార్యాలయంలో తలపెట్టిన సమావేశానికి కళాకారులు తప్పక హాజరుకావాలని జిల్లా కళాకారుల సంక్షేమ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఆ మేరకు మంగళవారం స్థానిక డ్రామా ఆర్టిస్ట్ అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ సంఘం గౌరవాధ్యక్షులు ఎం. చెన్నయ్య, జిల్లా కన్వీనర్ మహ్మద్ రఫీ మాట్లాడారు.

రికార్డులు తనిఖీ

వల్లూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): 2020-25 వరకు జరిగిన పనులకు సంబంధించిన ఆడిట్ నిర్వహణను మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డీడీవో మైథిలీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. 15వ ఆర్థికసంఘం నిధులతో పాటు వివిధ నిధులను ఎలా సద్వినియోగపరిచారని పరిశీలించారు. అలాగే బ్యాం కు లాభాలు కూడా బ్యాంకు పాస్‌బుక్ లలో ఉన్నాయా లేవా అనే వాటిపై క్షుణ్ణంగా డీడీఓ బృందం తనిఖీ చేశారు.

యూరియా కోసం ఎగబడ్డ రైతులు



ఉప్పరపల్లెలో యూరియా కూపన్ల కోసం గుంపులుగా చేరిన రైతులు

చెన్నూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రైతులకు పుష్కలంగా యూరియా అందడంలేదంటూ మండలంలోని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కరోజు యూరియా వచ్చినా వాటి కోసం ఎగబడాల్సిన పరిస్థితి వస్తుంది. ప్రభుత్వం కాస్త ఓపిగ్గా ఉండండి, అందరికీ యూరియా అందిస్తాం, ఏ ఒక్కరికీ యూరియా అందలేదన్న భావన లేకుండా చేస్తాం అని పదే పదే చెబుతున్నా రైతులు మాత్రం అవసరానికి కావాలి, ఆలస్యమైతే మాకు ఇబ్బంది అంటూ యూరియా లోడు వచ్చిందంటే చాలు వాటి కోసం గుంపులు గుంపులుగా వస్తున్నారు. మంగళవారం ఉప్పరపల్లెలో యూరియా నిల్వలు ఉన్నాయని తెలియగానే రైతులంతా ఒక్కమారు యూరియా పొందేందుకు టోకన్లు రాయించుకునేందుకు రావడం జరిగింది. వీరితో ఏవో శ్రీదేవి ప్రతి రైతుకు యూరియా అందుతుందని ఏ రైతు ఆందోళన పడవద్దని అవసరమైన మేరకు నిల్వలు వస్తున్నాయని చెప్పడంతో పాటు యూరియా పంపిణీ వద్ద సమస్యలు లేకుండా పోలీసు సిబ్బంది సహాయంతో పంపిణీ చేయడం జరుగుతుంది.

రైతులను వేధిస్తున్న కూటమి ప్రభుత్వం

వైసీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డి



ఏడీఏకు వినతిపత్రం అందిస్తున్న రవీంద్రనాథరెడ్డి

కమలాపురం రూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : గత 18 నెలలుగా రైతులను కూటమి ప్రభుత్వం వేధిస్తూనే ఉందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డి అన్నారు. మంగళవారం రైతన్నకు అండగా జగనన్న కార్యక్రమంలో భాగంగా కమలాపురంలో మాజీ ఎమ్మెల్యేరవీంద్రనాథ రెడ్డి, కమలాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ నరేన్ రామాంజులరెడ్డి నియోజక వర్గంలోని అన్ని మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు.

వేంపల్లె షరీఫ్‌కు కీర్తిపురస్కారం



వేంపల్లె, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెకు చెందిన కథారచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారగ్రహీత డాక్టర్ వేంపల్లె షరీఫ్‌కు తెలుగు యూనివర్సిటీ కీర్తి పురస్కారానికి ఎంపిక చేశారు. ఈనెల 23,24 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో నగదు బహుమతితో పాటు కీర్తి పురస్కారాన్ని అందుకోనున్నారు. జుమ్మా, టోపీజబ్బార్, చారలపిల్లి వంటి కథలు రాయగా వివిధ భాషల్లో తర్జుమా జరిగాయి. ఆకుపచ్చముగ్గు కథ డిగ్రీలో పాఠ్యాంశంగా చేర్చారు. ప్రతిభను గుర్తించి ఈ పురస్కారం ప్రకటించడం పట్ల షరీఫ్ సంతోషం వ్యక్తం చేశారు.

స్వచ్ఛత కోసం పాటుపడదాం



మాట్లాడుతున్న సురేశ్‌బాబు

చెన్నూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎలాంటి అపరిశుభ్రంగా లేకుండా స్వచ్ఛతగా ఉండేందుకు పాటుపడతామని తద్వారా అందరం ఆరోగ్యంగా ఉందామని డిప్యూటీ ఎంపీడీవో సురేశ్‌బాబు అన్నారు. చెన్నూరులోని ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రంలో మంగళవారం చెన్నూరు గ్రామ పంచాయతీలోని పారిశుధ్య కార్మికులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి రామసుబ్బారెడ్డి, సీఆర్పీలు గురువేశ్వర్‌రావు, రాజకుమారి పాల్గొన్నారు.

భూమికి పచ్చాని రంగేసినట్లు...



పుడమికి పచ్చని రంగేసినట్లు వేంపల్లె ప్రాంతంలో వరిపొలాలు ఆహ్లాదకరంగా దర్శనమిస్తున్నాయి. వేంపల్లె,కుమ్మరాంపల్లె, ఇడుపులపాయ, వీరన్నగట్టుపల్లె, అలిరెడ్డిపల్లె, తువ్వపల్లె గ్రామాల్లో వరిని సాగుచేశారు. గండిరోడ్డులో, ట్రిపుల్‌ఐటీకి వెళ్లే మార్గంలో ఇరువైపులా పచ్చని పొలాలు ఆహ్లాదకరంగా కనువిందు చేస్తున్నాయి.

వేంపల్లె,ఆంధ్రజ్యోతి

యూరియా కొరత లేదు



నరసింహారెడ్డి

కమలాపురం రూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కమలాపురం డివిజను పరిధిలో యూరియా కొరత లేదని కమలాపురం వ్యవసాయ సంచాలకుడు నరసింహారెడ్డి తెలిపారు. ఈసందర్భంగా తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కమలాపురం డివిజన్ పరిధిలో ఎక్కడే కానీ యూరియా కొరత లేదని, అవసరానికంటే ఎక్కువగానే సరఫరా చేశామని ఆయన తెలిపారు. తన డివిజను పరిధిలోని కమలాపురం, వల్లూరు, వీఎన్‌పల్లె, ఎర్రగుంట్ల మండలాల్లో సుమారు4,438 హెక్టార్లలో రైతులు పంటలు సాగు చేశారన్నారు. పంటలకు 500 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమైతే ఇప్పటికే ప్రైవేటు డీలర్ల ద్వారా 172రైతు సేవాకేంద్రాల ద్వారా 782,మన గ్రోమోర్ కేంద్రాల ద్వారా 100 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు అందించామన్నారు.ప్రస్తుతం చిన్నచెప్పలి, సంబటూరు కేంద్రాల్లో 20 మెట్రిక్ టన్నుల డీఏపీ అందుబాటులో ఉందని త్వరలో అన్ని కేంద్రాల్లో సరఫరా చేస్తామని తెలిపారు. కమలాపురం మార్కెట్‌యార్డులో క్వింటా ఉల్లికి రూ.1200 మద్దతు ధర కల్పిస్తూ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశామని రైతులు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

ఉద్యాన రైతుకు అవార్డు

సీకేదిన్నె, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): చింతకొమ్మదిన్నె మండలం కొలుములపల్లె కృష్ణాపురానికి చెందిన ఉద్యాన రైతు అన్నంరాజు హరి బెంగళూరులో ఇన్నోవేషన్ ఫార్మర్ అవార్డు 2025 అవార్డు అందుకున్నారు. బెంగళూరులో మంగళవారం ఈ అవార్డును అందుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఉద్యాన పంటలు అయిన తమలపాకులో కొత్త వెరైటీని తెల్లాకు తీగెలు ఆకులు పండించినందుకు ఈ అవార్డుకు ఎంపిక కావడం జరిగిందన్నారు.



అవార్డు అందుకుంటున్న అన్నంరాజు హరి

రోడ్డు ప్రమాదాల ప్రదేశాలు పరిశీలన



గువ్వల చెరువు ఘాట్‌లో ప్రమాదాలు జరిగే ప్రదేశాన్ని పరిశీలిస్తున్న అధికారులు

సీకేదిన్నె, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను ఆర్టీవో ప్రసాద్, నేషనల్ హైవే డీఈ, ఏఈ, సీకేదిన్నె సీఐ బాలమద్దిలేటి, ఎస్ఐ శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం పరిశీలించారు. ఊటుకూరు వద్ద నుంచి గువ్వల చెరువు ఘాట్ వరకు తరచూ ప్రమాదాలు జరిగే ప్రదేశాలను వారు పరిశీలించారు. ఎక్కడ ఎటువంటి నివారణ చర్యలు తీసుకోవాలో ప్రమాదాలకు గల కారణాలు తదితర వివరాలను సేకరించారు. అందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి నివేదిక తయారు చేస్తామని ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

మేలైన ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించాలి

కమలాపురం రూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మేలైన ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించాలని ఏవో ఎం.సరస్వతి తెలిపారు. మంగళవారం,సంబటూరు చిన్నంపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది లత, స్వరూప, సోనీ, గ్రామ వ్యవసాయ సహాయకురాలు ప్రసన్న, రైతులు తదితరులు పాల్గొన్నారు.

డీపీఓ హామీతో సమ్మె విరమణ



కార్మికులతో మాట్లాడుతున్న డీపీఓ రాజ్యలక్ష్మి, తులసిరెడ్డి

వేంపల్లె, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలో పారిశుధ్య కార్మికులు వేతనాలు ఇవ్వనందుకు నిరసనగా నిర్వహించిన సమ్మె మంగళవారం కొనసాగింది. 6వ రోజు విధులకు దూరంగా ఉండడంతో వేంపల్లెలో పారిశుధ్యం దుర్భరంగా మారింది. డివిజనల్ స్థాయి, స్థానిక అధికారులు జోక్యం చేసుకున్నా సమస్య కొలిక్కి రాకపోవడం తో జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి మంగళవారం పంచాయతీ కార్యాలయానికి వచ్చారు. కార్మికులను పిలిచి త్వరలో ఇచ్చేందుకు నచ్చజెప్పేందుకు ప్రయత్నించినా మొదట వినిపించుకోలేదు. కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. వేతనాలు ఇచ్చే వరకు పనులకు వెళ్లేది లేదంటూ భీష్మించారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్‌పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి, ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ బాదుల్లా, టీడీపీ మైనార్టీ సెల్ మాజీ డైరెక్టర్ షబ్బీర్, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు సాదక్‌వల్లి తదితరులు డీపీఓతో చర్చించారు.వేతనాలు ఇచ్చే ఏర్పాట్లుచేయాలని, ఇవ్వకుంటే కార్మికులు ఎలా పనిచేస్తారని డీపీఓకు తెలిపారు. వేతనాలకు సరిపడా డబ్బును సమకూర్చుకొని వెంటనే చెల్లించాలని డీపీఓకు తెలిపారు.దీంతో డీపీఓ రాజ్యలక్ష్మి ధర్నాచేస్తున్న కార్మికులతో 24గంటలోగా వేతనాలు చెల్లిస్తాం త్వరలో పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ మొత్తాలను చెల్లిస్తామని పెద్దమనుషుల సమక్షంలో హామీ ఇవ్వడంతో అంగీకరించారు. పనులకు వెళ్తామని అంగీకరించారు. ఇచ్చిన మాట ప్రకారం వేతనాలు ఇవ్వకుంటే మళ్లీ సమ్మెలోకి దిగుతామని కార్మికులు స్పష్టం చేశారు. సాయంత్రం ఒకటి,రెండు చోట్ల ఉన్న చెత్తను ట్రాక్టర్ల ద్వారా తరలించారు. డీఎల్‌పీఓ రమాదేవి, ఈఓఆర్డీ రామ్మోహన్‌రెడ్డి, వీరపునాయునిపల్లె సెక్రటరీ నాగభూషణంరెడ్డి దగ్గరుండి పనులు చేయించారు. దీనితో ప్రస్తుతానికి డీపీఓ హామీతో దిగివచ్చిన పారిశుధ్య కార్మికులు బుధవారం నుంచి పూర్తిస్థాయిలో పనులు చేస్తామని తెలిపారు.

జ్వరాలతో జనాలు బెంబేలు

● రోగులతో కిటకిటలాడుతున్న ఆసుపత్రులు ● పల్లెలను పట్టిపీడిస్తున్న సీజనల్ వ్యాధులు ● వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలంటూ వినతి



రోగులతో కిట కిటలాడుతున్న ప్రభుత్వాసుపత్రి

బద్వేలు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఇటీవల వర్షాలు కురియడంతో పల్లెలు, పట్టణాలు అని తేడాలేకుండా జనాలు జ్వరాల బారిన పడి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జ్వరాలు గ్రామ గ్రామాన విజృంభిస్తున్నాయి. వైద్య సేవల కోసం పల్లెలతోపాటు పట్టణాల్లోని ఆసుపత్రులకు పరుగులు పెడుతున్నారు. జ్వరాలు తీవ్రంగా ఉన్నవారు కడప, తిరుపతి ప్రాంతాలకు వెళ్తున్నారు. ఊరు దాటితే వేలకు వేలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. గ్రామాలలో జ్వరపీడితులు అధికంగా ఉండడంతో ప్రైవేటు, ప్రభుత్వ ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. గత కొన్ని రోజుల నుంచి పోరుమామిళ్ల, బద్వేలు ప్రభుత్వ ఆసుపత్రిలో జ్వర పీడితుల సంఖ్య బాగా పెరిగింది. ఇక్కడ వైద్యం నయం కాకపోతే పట్టణ ప్రాంతాలకు వెళ్తున్నారు. రోజురోజుకు జ్వరాలు విజృంభిస్తుండడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. బద్వేలు నియోజకవర్గ పరిధిలోని పోరుమామిళ్ల మండలం టేకూరు పేట, తిమ్మారెడ్డిపల్లె, తోకలపల్లె, ఎస్టీ కాలనీలలో పోరుమామిళ్లలో జ్వరాలు అధికంగా ఉన్నాయి. అట్లూరు మండలంలోని ఎస్.వెంకటాపురం, కొండూరు, అట్లూరు, గోపవరం మండలంలోని బ్రాహ్మణపల్లె, చిన్న గోపవరం, బద్వేలు పట్టణం పరిధిలో గ్రామ గ్రామాన జ్వరాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ల కొరత తీవ్రంగా ఉంది. 12 మంది ఉండాల్సి ఉండగా 6 మంది మాత్రమే ఉన్నారు. అలాగే బద్వేలు ప్రభుత్వ ఆసుపత్రిలో 12 మంది వైద్యులు ఉండాల్సి ఉండగా 6 మంది వైద్యులు మాత్రమే ఉన్నారు. జనరల్ డాక్టర్ కూడా లేరు. సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకుని జిల్లా అధికారులు స్పందించి ఆయా గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్యసేవలందించాలని ప్రజలు కోరుతున్నారు.

జ్వరాల నియంత్రణకు చర్యలు తీసుకుంటాం



జ్వరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నాం. గ్రామాల్లో ఐదుగురికి మించి జ్వరాలు ఉన్నట్లు నిర్ధారణ అయితే అప్రాంతంలో రెండు, మూడు రోజుల పాటు వైద్య శిబిరాలు నిర్వహించి వైద్య పరీక్షలు, మందులు అందించి వ్యాధులు ప్రబలకుండా చూస్తాం. సబ్ యూనిట్ అధికారి ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి లార్వా సర్వే చేసి దోమల నియంత్రణకు ఫాగింగ్ చేసి జ్వరాలు ప్రబలకుండా జాగ్రత్తలు చేపడుతాం.

-మల్లేష్, డిప్యూటీ డీఎంహెచ్‌వో, బద్వేలు

సోచ్ ఫౌండేషన్ దివ్యాంగులకు ఆర్థిక సాయం



జమ్మలమడుగు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు సోచ్ ఫౌండేషన్ దివ్యాంగులకు బాలాజీ హైస్కూలు డైరెక్టర్ బైరెడ్డి రవీంద్రారెడ్డి రూ.1,40,102 ఆర్థికసాయం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ . ప్రస్తుతం దివ్యాంగులకోసం విద్యార్థుల సహకారంతోపాటు తాము రూ.1,40, గతంలోరాగసుధ ఫౌండేషన్ వారికి రూ.1.15 లక్షలు వితరణ చేయడం జరిగిందన్నారు. మే ఐ హెల్ప్‌యూ ఫౌండేషన్ వారికి సహకారం అందిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన పిలుపుమేరకు రూ.లక్షకుపైగా గత సంవత్సరం అమరావతిలో జరిగిన వరద బాధితులకు ఆర్థిక సాయం చేశామన్నారు. అనంతరం విద్యార్థులకు మెమెంటో, సర్టిఫికెట్లు, మెడల్ ఇచ్చి అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనధికారిక కొళాయిలను క్రమబద్ధీకరించుకోవాలి

జమ్మలమడుగు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలో నీటి కుళాయి కనెక్షన్లు, అనధికారికంగా ఉన్నవాటిని సెప్టెంబరు 15వ తేదీ లోపు డబ్బులు చెల్లించి క్రమబద్ధీకరించుకోవాలని మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి తెలిపారు. అలా చేయకుంటే చర్యలు తప్పవన్నారు. నీటి పన్ను బకాయి ఉన్నవారు వెంటనే చెల్లించాలన్నారు. అక్రమ కుళాయిలు రెగ్యులర్ చేసుకుని నీటి పన్నులు చెల్లించాలని ఇందుకు పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు.

రేపు ప్రత్యేక విద్యుత్ అదాలత్

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికై ఈనెల 11న ఉదయం 11.30 గంటలకు పత్యేక విద్యుత్ అదాలత్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఈఈ రమణారెడ్డి తెలిపారు. స్థానిక డివిజన్ విద్యుత్ కార్యాలయం పవర్ హౌస్ కాంపౌండ్‌లో నిర్వహిస్తున్న అదాలత్‌కు చైర్మన్ శ్రీనివాస ఆంజనేయ మూర్తి రిటైర్డ్ జడ్జి ఆర్థిక సాంకేతిక సభ్యుడు మధుకుమార్, స్వతంత్ర సభ్యురాలు విజయలక్ష్మీ డివిజన్ విద్యుత్ అధికారులు పాల్గొంటారని తెలిపారు.

జమ్మలమడుగులో: విద్యుత్తు వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 11న ప్రొద్దుటూరులో ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఏడీఈ రాజగోపాల్ తెలిపారు. రాజుపాళెం, ఎర్రగుంట్ల, ముద్దనూరు, కొండాపురం, వీఎన్ పల్లె, మైలవరం, కమలాపురం, పెద్దముడియం మండలాల వినియోగదారులు వారి సమస్యలు పరిష్కరించుకోవచ్చన్నారు.

టపాసుల లైసెన్సులకు దరఖాస్తు చేసుకోండి

జమ్మలమడుగు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు రెవెన్యూ డివిజన్ పరిధిలో టపాసుల లైసెన్సు కొరకు దరఖాస్తులను కోరుతున్నట్లు ఆర్డీవో సాయిశ్రీ తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ దీపావళి పండుగ సందర్భంగా టపాసుల కొత్త లైసెన్సులకు సంబంధించి ఫారం ఎల్ఈ-5లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. గత సంవత్సరంలో ఫారం ఎల్ఈ-5 లైసెన్సులు పొందినవారు తదుపరి రెన్యువల్ కొరకు ఫారం ఆర్ఈ-1తోపాటు సీఎఫ్ఎంఎస్‌లో రూ.500 చలానా చెల్లించి ఈనెల 18వ తేదీలోపు రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని తెలిపారు. ఆసక్తిగలవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో కోరారు.

నైతిక విలువలతో కూడిన విద్యనందించాలి




ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎంఈవో మహ్మద్ షఫీ

కాశినాయన సెప్టెంబరు9 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన విద్యను అందించాలని ఎంఈవో 1 మహమ్మద్ షఫీ పేర్కొన్నారు. మంగళవారం వరికుంట్ల సమీపంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలన్నారు. అనంతరం తరగతి గదులకు విద్యార్థులతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమై పలుచూచనలు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

ఎర్రగుంట్ల, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిలమకూరు ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో జరిగిన రోడ్డుప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. చిర్రాజుపల్లెకు చెందిన ప్రసాద్, దండుఎల్లెకు చెందిన నరేష్‌లు ఆగివున్న ఎక్స్‌కవేటర్‌ను ఢీకొట్టడం వల్ల ఈప్రమాదం జరిగినట్లు పోలీసులు పేర్కొన్నారు.

గ్రంథాలయాన్ని తనిఖీ చేసిన జిల్లా కార్యదర్శి



రికార్డులను పరిశీలిస్తున్న అమిరుద్దీన్

చాపాడు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చాపాడులోని ప్రభుత్వ గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి అమిరుద్దీన్ మంగళవారం తనిఖీ చేశారు. గ్రంథాలయంలోని రికార్డులను ఆయన పరిశీలించారు. గ్రంథాలయాలకు వచ్చే పాఠకుల సంఖ్యను పెంచాలని, లైబ్రేరియన్ శివశంకర్‌రెడ్డికి ఆయన సూచనలు ఇచ్చారు. అన్ని గ్రామాల ప్రజలు గ్రంథాలయంలోని పుస్తకాలను చదువుకుని విజ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు.

రసాభాసగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

● చైర్‌పర్సన్‌కు కమిషనర్ క్షమాపణ చెప్పాలని వైసీపీ కౌన్సిలర్ల నిరసన
● కమిషనర్‌కు క్షమాపణ చెప్పాలని టీడీపీ కౌన్సిలర్ల బైఠాయింపు
● అజెండా పై చర్చ ప్రారంభం కాకనే అర్ధాంతరంగా ముగిసిన సభ



కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే తో వాదిస్తున్న వైస్‌చైర్మన్ బంగారుమునిరెడ్డి

ప్రొద్దుటూరు , సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం రసాభాసగా సాగింది.మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లె లక్ష్మీదేవి అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం మధ్యాహ్నం 3.30 గంటలకు ఏర్పాటు చేశారు. ఈ సభలో వైసీపీ మున్సిపల్ వైస్‌చైర్మన్ బంగారు రెడ్డి మాట్లాడుతూ ఆగస్టు 30న మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి కౌన్సిల్ సమావేశం జరగకూడదనే ఉద్దేశ్యంతో ఆయన చైర్‌పర్సన్ ఫోన్‌కు గానీ లెటర్లకు గానీ స్పందించకుండా బీసీ మహిళా చైర్‌పర్సన్‌ను అవమానించారన్నారు. ఇందుకు కమిషనర్ చైర్‌పర్సన్‌కు క్షమాపణ చెప్పాలన్నారు. స్పందించిన కమిషనర్‌కు రవిచంద్రారెడ్డి మున్సిపల్ యాక్ట్ 47, 31(ఏ) ప్రకారం తాను నడుచుకున్నాను తప్ప ఎక్కడా చట్టవిరుద్ధంగా వ్యవహరించలేదన్నారు. ఎక్స్‌అఫిషియో సభ్యుడు ఎమ్మెల్యే వరదరాజులురెడ్డి మాట్లాడుతూ కమిషనర్ బహిరంగంగా క్షమాపణ చెప్పేంత తప్పు ఏమి చేశాడని ఏదైనా ఆయన పరిపాలనా పరమైన తప్పిదం చేశాడని భావిస్తే ఉన్నతాధికా రులకు ఫిర్యాదు చేసుకోమన్నారు. దీంతో వైసీపీ మహిళా కౌన్సిలర్లు బీసీ మహిళా చైర్‌పర్సన్‌కు కమిషనర్ క్షమాపణ చెప్పాల్సిందే అని పోడియం ముందు కూర్చొని నినాదాలు చేశారు. ఈక్రమంలో వైస్ చైర్మన్ ఖాజా కమిషనర్ రవిచంద్రారెడ్డిని అవమాన పరిచేలా మాట్లాడారని కమిషనర్‌కు క్షమాపణలు చెప్పాలని పోటీగా టీడీపీ కౌన్సిలర్లు చైర్మన్ పోడియం ముందు బైఠాయించారు. దీంతో కౌన్సిల్ సమావేశం అజెండా పై చర్చ ప్రారంభం కాకుండానే పక్కదారి పట్టింది. దీంతో సభ ముందుకు సాగకపోవడంతో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి సభనుంచి టీడీపీ కౌన్సిలర్లతో బయటికి వచ్చేశారు. ఆయన వెంట కమిషనర్, మున్సిపల్ అధికారులంతా కౌన్సిల్‌సమావేశం నుంచి వెళ్లిపోయారు. వైసీపీ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లు కౌన్సిల్ సమావేశం జరుపకుండా ఎమ్మెల్యే వెంటఎలా వెళతారని మున్సిపల్ అధికారులను ప్రశ్నించారు. కమిషనర్ వచ్చి సభ నిర్వహించాలని ఫోన్‌లో చైర్‌పర్సన్ లక్ష్మీదేవి కోరగా కమిషనర్ ఇప్పటికి ఆఫీసు పనివేళలు ముగిశాయని తదుపరి మీరు ఇచ్చేతేదీలలలో సమావేశం నిర్వహిస్తామని వారికి తెలిపారు.

మున్సిపల్ ఆదాయానికి గండి కొట్టడమే వైసీపీ లక్ష్యం :

మున్సిపల్ ఆదాయానికి గండి కొట్టడానికి కౌన్సిల్ సమావేశాలు జరగకుండా వైసీపీ వారు అడ్డుకుంటున్నారని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఆరోపించారు. టీడీపీ కౌన్సిలర్లతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వైసీపీ గత నాలుగేళ్ల కాలంలో మున్సిపాలిటీ ఖజానాను లూటీ చేసిందన్నారు. అధికారంలోని టీడీపీకి ఎలాగైనా ప్రజల్లో చెడ్డపేరు తేవడానికి నిజంగా వైసీపీకి ఎగ్జిబిషన్‌కు కూరగాయల మార్కెట్‌కు సకాలంలో వేలంపాటలు నిర్వహించి మున్సిపాలీటీకి ఆదాయం తీసుకురావాలనుకుంటే కౌన్సిల్ సమావేశం జరగకున్నా చైర్‌పర్సన్ లక్ష్మీదేవి ఎగ్జిబిషన్‌వేలంపాటలకు ముందస్తు అనుమతులు ఇచ్చి టెండర్లు జరిపి ఉండవచ్చన్నారు. సమావేశంలో టీడీపీ కౌన్సిలర్లు మురళీధర్ రెడ్డి సరిత, వెంకట లక్ష్మీ, జ్యోతి ,కమాల్, జలాన్,దీప్తి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాన్ని దెబ్బతీసే ప్రతి అంశాన్ని తిరస్కరించాలి

బద్వేలుటౌన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : లక్ష్యాన్ని దెబ్బతీసే ప్రతి అంశాన్ని తిరస్కరించడమే అసలైన బ్రహ్మచర్యఅని స్వామి తురియానందసరస్వతి అన్నారు. మంగళవారం రామక్రిష్ణసేవాసమితి ఆధ్వర్యంలో పట్టణంలో భగవద్గీతసప్తాహ కార్యక్రమాన్ని నిర్వహించారు. అసలైన మానవజీవితం లక్ష్యం ఏమిటి ? దాన్ని ఎలా సాధించాలి ? సాధనలో అవరోధాలను ఎలా అధిగమించాలి అనే అంశాలను భగవద్గీతలోని అంశాల ఆధారంగా ప్రజలందరికీ అర్థమయ్యే రీతిలో వివరించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి

బద్వేలుటౌన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధులపట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, మెడికల్ ఆఫీసర్‌లు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని గాంధీనగర్ పట్టణఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్లు, హెల్త్‌సెక్రటరీలు, ఆరోగ్యకేంద్ర సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వాతావరణంలో మార్పుల వల్ల ప్రజలు అనారోగ్యాలపాలవుతున్నారని, ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తంచేస్తూ సీజనల్ వ్యాధులపట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు అందించే వైద్యసేవలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు శరత్‌చంద్ర, శ్రీనివాసులు, సౌమ్య, హెల్త్‌సూపర్‌వైజర్ శివరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'అన్నదాత పేర నిరసన తెలిపే నైతిక హక్కు వైసీపీకి లేదు'



సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు, సుబ్బారెడ్డి

ప్రొద్దుటూరు , సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : అన్నదాత పేరుతో కూటమి ప్రభుత్వంపై నిరసన తెలిపే నైతిక హక్కు వైసీపీ కి లేదని వాల్మీకి బోయ కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల నాగరాజు, టౌన్‌బ్యాంకు డైరెక్టర్ సుబ్బారెడ్డిలు మండిపడ్డారు. మంగ్గళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయకుండా కాలువ లు నిర్మించకుండా రైతులకను మోసం చేసిన ఘనత వైసీపీదన్నారు. రాష్ట్రంలో యూరియా కొరత ఎక్కడా లేకున్నా రైతులు ఎవ్వరూ ఆందోళన చేయకున్నా వైసీపీ నిరసన ర్యాలీలు చేపట్టితమ ఉనికిని చాటుకుంటోందని ధ్వజమెత్తారు. ఈ సమావేశంలో టీడీపీ నేతలు చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు రక్తహీనతపై శ్రద్ధ పెట్టాలి

దువ్వూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి):గర్భిణులు రక్తహీనత రాకుండా శ్రద్ధపెట్టాలని వైద్యులు రోషిణి, హేమలత తెలిపారు. దువ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 25 మంది గర్భిణీ స్త్రీలు పాల్గొనగా 13 మంది హైరిస్క్ గర్భిణీలుగా గుర్తించి వారికి స్కానింగ్‌లు నిర్వహించినట్లు వారు తెలిపారు.

యూరియాను పంటకు మోతాదుగా వాడాలి



దాసరిపల్లెలో రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి అమర్‌నాథ్‌రెడ్డి

దువ్వూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సాగు చేసిన పంటలకు యూరియాను తగిన మోతాదులో వాడాలని మండల వ్యవసాయాధికారి అమర్‌నాథ్‌రెడ్డి సూచించారు. దువ్వూరు మండలం దాసరిపల్లె గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్‌లో వరి, మొక్కజొన్న, పసుపు, ఉల్లి, మినుము పంటలు సాగైనట్లు తెలిపారు. రైతులు అవగాహన లేకుండా అధిక మోతాదులో యూరియాను వాడటం వలన తెగుళ్లసోకి దిగుబడులపై ఆ ప్రభావం చూపుతుందని వివరించారు. కార్యక్రమంలో ఉద్యాన సహాయకురాలు జెరూహ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులు, పాల్గొన్నారు.

బి.కోడూరులో: పంటకు ఎంత అవసరమో అంత మేరకు యూరియాను వాడాలని వ్యవసాయాధికారి కౌశిక తెలిపారు. మంగళవారం మండలపరిధిలోని పెదుళ్లపల్లె గ్రామంలో పొలం పిలుస్తోందిలో భాగంగా రైతులకు యూరియా వాడకంపై అవగాహన కల్పించారు. అధిక మోతాదులో యూరియా వాడడం వల్ల పంటకు చీడపీడలు అధికమవుతాయని అలాగే భూసారవంతం తగ్గిపోతుందన్నారు. ఖరీఫ్‌లో పంటలో సాగు చేసిన రైతులు ఈ నెల 30లోగా పంట నమోదు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి తహసీల్, రైతులు పాల్గొన్నారు.

యూరియా కొరత ఉండదు



యూరియా పంపిణీ చేస్తున్న ఏవో

ఖాజీపేట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో రైతులకు కావాల్సిన మేరకు రైతు భరోసా కేంద్రాల ద్వారా యూరియా అందిస్తున్నామని వ్యవసాయ శాఖాధికారి నాగార్జున అన్నారు. మంగళవారం మండల పరిధిలోని రావణపల్లెను ఉపసర్పంచ్ లక్ష్మీరెడ్డి, పోలీసుల సమక్షంలో యూరియా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రావణపల్లె పంచాయతీలో మంగళవారం 160 బ్యాగులు పంపిణీ చేయడం జరిగిందని, గత వారంలో 420 బ్యాగులు యూరియా, 200 బ్యాగులు డీఏపీ పంపిణీ చేశామని, అయితే రైతులు కొరత వస్తుందనే ఉద్దేశ్యంతోనే యూరియా కోసం కష్టపడుతున్నారని, రైతులకు సకాలంలో యూరియా అందిస్తామని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. యూరియా పంపిణీ 10 గంటల తర్వాత ఇస్తామని చెప్పడంతో రైతులు 8 గంటలకే రైతు భరోసా కేంద్రం చేరుకోవడంతో రైతులు గుమికూడారన్నారు.

పంటల నమోదు తప్పనిసరిగా చేయించండి

మైదుకూరు రూరల్,సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ సీజన్‌లో రైతులు వారు సాగు చేసిన పంటలను ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని వ్యవసాయాధికారి బాలగంగాధర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని గంగాయపల్లె, ఉప్పుగుంటపల్లె గ్రామాలలో వ్యవసాయాధికారులు మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఏడీఏ క్రిష్ణమూర్తి, బాలగంగాధర్‌రెడ్డిలు గ్రామంలోని పంటలను పరిశీలించారు. అనంతరం వారు రైతులతో మాట్లాడుతూ రైతులు పంటలను యూరియా మోతాదును తక్కువగా వాడుకోవాలన్నారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ డబ్బులు అకౌంట్లలోపడని రైతులు దగ్గరలోని రైతు సేవా కేంద్రాలలోని సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు.

ఘనంగా వరల్డ్ ఫిజియోథెరపీడే వేడుకలు



డాక్టర్ వీరకుమార్‌రెడ్డిని సత్కరిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వరల్డ్ ఫిజియోథెరపీడే వేడుకలను సోమవారం ఫిజియోథెరపిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కొవ్వూరు గ్రాండ్‌లో జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్ నూతన కార్యవర్గంను ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా డాక్టర్ వి.వీరకుమార్‌రెడ్డి, అధ్యక్షురాలుగా డాక్టర్ సుమాదేవి, కార్యదర్శి డాక్టర్ బి.ఓబులేసు, కోశాధికారి డాక్టర్ కె.వెంకటసుబ్బయ్యలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గురుచంద్ర, ఎన్.విజయ్, అంజనాదేవి, చంద్రలీల, సర్వేష్ తదితరులు పాల్గొన్నారు.

బద్వేలు మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ సుప్రజకు ఘనసన్మానం



మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ సుప్రజ దంపతులను సన్మానిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు

పోరుమామిళ్ల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బద్వేలు మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ నారిశెట్టి సుప్రజను జిల్లా బీజేపీ అధ్యక్షుడు జంగిటి వెంకటసుబ్బారెడ్డి సన్మానించారు. మంగళవారం కడపలోని బీజేపీ కార్యాలయంలో ఆమెను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టేకూరుకు చెందిన నారిశెట్ట సుప్రజకు బద్వేలు మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ పదవి దక్కడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో జిల్లా మాజీ అధ్యక్షులు శ్రీనాథరెడ్డి, కందుల మురళీమోహన్‌రెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రమణాచారి, బీజేపీ నాయకులు శ్రీనివాసులరెడ్డి, బ్రహ్మయ్య, నారిశెట్టి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రైతాంగ సమస్యలు పరిష్కరించాలి



ఆర్డీవో కార్యాలయ ఏవో ఇక్బాల్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ

జమ్మలమడుగు/బద్వేలు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని వైసీపీ నాయకులు డిమాండ్ చేశారు. వైసీపీ అధిష్ఠానం పిలుపుమేరకు ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, ఆ పార్టీ నాయకులు అన్నదాత పోరు పేరుతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో ఏవో ఇక్బాల్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు కొమెర్ల మోహన్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు పోరెడ్డి మహేశ్వరరెడ్డి, దన్నవాడ మహేశ్వరరెడ్డి, దాల్మియా బాధిత రైతులు తదితరులు పాల్గొన్నారు. బద్వేలులో వైసీపీ అన్నదాత పోరు కార్యక్రమంలో ఎమ్మెల్యే సుధ, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ర్యాలీగా వచ్చి కూటమి ప్రభుత్వంపై నిరసన తెలిపారు. అనంతరం ఆర్డీఓ చంద్రమోహన్‌కు వినతిపత్రం అందజేశారు.

నిబంధనలు బేఖాతర్..హైస్కూల్ ఆవరణలో వైసీపీ పోరు



బద్వేలు, సెప్టెంబరు 9, (ఆంధ్రజ్యోతి): పాఠశాలను రాజకీయాలకు వాడకూడదు, అక్కడ రాజకీయాలు చేయకూడదు అని ఇటీవలే ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినా వైసీపీ అదేమి పట్టించుకోలేదు. తమ రాజకీయ లబ్ధే ముఖ్యం అన్నట్లుగా స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో రాజకీయ కార్యకలాపాలకు పాల్పడింది. పాఠశాలలోనే ఆందోళన కొనసాగించడం పలు విమర్శలకు తావిస్తోంది. వైసీపీ అన్నదాత పోరుకు పిలుపునిచ్చింది. బద్వేలులో వైసీపీ నాయకులు, ఏమాత్రం పట్టించుకోకుండా జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో బ్యానర్లు చేతపట్టుకుని ధర్నా చేయడం జరిగింది.

విద్యార్థులు సత్ప్రవర్తనతో మెలగాలి

అట్లూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సత్ప్రవర్తనతో మెలగాలని అట్లూరు ఎస్ఐ రామక్రిష్ణ సూచించారు. అట్లూరు ఉన్నత పాఠశాల 9, 10 తరగతుల విద్యార్థులకు మంగళవారం సత్ప్రవర్తనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ తల్లిదండ్రి గురువుల తోటి విద్యార్థులు సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. అలాగే విద్యార్థులంతా ఉన్నత శిఖరాలకు ఎదిగి సమాజానికి తోడ్పాడాలన్నారు. సెల్‌ఫోన్లకు బానిస కాకుండా దృఢ సంకల్పంతో మెలగాలని సూచించారు.